


నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com

ఎన్టీఆర్ కృష్ణా

గురువారం 23 అక్టోబర్ 2025 పేజీలు 8


# వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి కృషి




- విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని)
- ఎస్‌హెచ్‌జిలతో క్లస్టర్ల ఏర్పాటు చేస్తాం
- ఎన్ఐఆర్డీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ జి. నరేంద్ర కుమార్
- ఏ.కొండూరు అభివృద్ధికి డిపిఆర్ రూపొందిస్తాం
- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ

**ఎన్టీఆర్ జిల్లా బ్యూరో, మేజర్ న్యూస్ :** జాతీయ గ్రామీణాభివృద్ధి సంస్థ (ఎన్ఐఆర్‌డి) భాగస్వామ్యంతో, జిల్లా యంత్రాంగం సహకారంతో వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి కృషిచేస్తామని విజయవాడ పార్లమెంట్ సభ్యులు & కేశినేని ఫౌండేషన్ చైర్మన్ కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు. బుధవారం స్థానిక కలెక్టరేట్లోని శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో ఎన్ఐఆర్‌డి, కేశినేని ఫౌండేషన్ అవగాహన ఒప్పందం (ఎంఓయు) అమలుపై జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎంపీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేశినేని శివనాథ్ (చిన్ని) మాట్లాడుతూ వికసిత్ భారత్, మిగతా 2లో

రెవెన్యూ సమస్యలపై...
# ప్రత్యేక దృష్టి పెట్టాలి




**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** జిల్లాలో నెలకొన్న పలు రెవిన్యూ సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టి పరిష్కారానికి కృషి చేయాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ సమావేశపు మందిరంలో జాయింట్ కలెక్టర్ ఎం నవీన్, సహాయ కలెక్టర్ ఫర్హీన్ జాహిద్, జిల్లా రెవెన్యూ అధికారి కే.చంద్రశేఖరరావు, కే ఆర్ ఆర్ సీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ మిగతా 2లో



# ఇంద్రకీలాద్రిపై పాము కాటు కలకలం

- ఓం టర్నింగ్ వద్ద రేపల్కెకి చెందిన భక్తుడిని కాటేసిన పాము
- విషపూరితమైనది కాకపోవడంతో తప్పిన ప్రమాదం

**ఇంద్రకీలాద్రి మేజర్ న్యూస్ :** ఇంద్రకీలాద్రి పై పాముకాటు కలకలం రేపుతోంది. రేపల్కెకి చెందిన భక్తుడిని ఓంటర్నింగ్ వద్ద 2



# జాతీయ సమైక్యతకు స్ఫూర్తి సర్దార్ వల్లభాయ్ పటేల్

- ప్రజలంతా జాతీయ ఐక్యతా భావంతో మెలగాలి
- 31 అక్టోబర్ నుంచి నవంబర్ 25 వరకు ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు
- కేంద్ర క్రీడలు, యువజన సంక్షేమం, మై భారత్ రాష్ట్ర సంచాలకులు అన్నుమన్ ప్రసాద్ దాస్

వివరాలు 2లో



(మొదటిపేజీ తరువాయి)

## వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి కృషి

స్వర్ణాంధ్ర 2047 లక్ష్యాల సాధనకు ఉపాధి కల్పన అత్యంత కీలకమన్నారు. జాతీయ గ్రామీణాభివృద్ధి సంస్థ (ఎన్ఐఆర్డీ) తో కలిసి స్వయం సహాయక సంఘాలకు నైపుణ్య అభివృద్ధి శిక్షణ ఇస్తామని తెలిపారు. సీడ్ బ్యాంకు, గిరిజన దుస్తులు, ఆభరణాల రూపకల్పన, విస్తరాకులు, వర్మీ కంపోస్ట్ తయారీ మొదలైన వాటికి అవసరమైన యంత్రాలను అందిస్తామని చెప్పారు. ఎస్సీ ఎస్టీ జనాభా అధికంగా ఉన్న ఎ.కొండూరు, జక్కంపూడి ల లో కామన్ ఫెసిలిటీ సెంటర్ల ఏర్పాటుకు జిల్లా యంత్రాంగం సహకరించాలని కోరారు. జాతీయ గ్రామీణాభివృద్ధి సంస్థ (ఎన్ ఐ ఆర్ డి) డైరెక్టర్ జనరల్ డాక్టర్ జి నరేంద్ర కుమార్ మాట్లాడుతూ భారత ప్రభుత్వం నూతనంగా రూరల్ ప్రాస్పరిటీ, రూరల్ రెస్లియన్స్ అనే కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. వన్ ఫ్యామిలీ-వన్ ఎంట్రప్రెన్యూర్ అనే ఆలోచన ను సాకారం చేయడానికి కేసినేని ఫౌండేషన్ తో కలిసి ఎస్ హెచ్ జి ల కు శిక్షణ ఇస్తామన్నారు. స్వయం సహాయక బృందాలతో మైక్రో ఎంటర్ప్రైజెస్ ఏర్పాటు చేయాలని, వీటికై క్లస్టర్లు ఉండాలని చెప్పారు. పెద్ద కంపెనీల నుంచి ఎస్ హెచ్ జి లకు ఆర్డర్లు ఇప్పించి అవి ఆర్థికంగా ఎదిగేందుకు కృషిచేస్తామన్నారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ మాట్లాడుతూ... ఏ.కొండూరు, జక్కంపూడిలలో కామన్ ఫెసిలిటీ సెంటర్ల ఏర్పాటుకు చర్యలు చేపడతామని చెప్పారు. ఏ.కొండూరు అభివృద్ధికి డిపిఆర్ రూపొందిస్తామన్నారు. ఆకాంక్షిత బ్లాకులకు ఉన్న 40 సూచీలలో 25 సూచీలలో సంతృప్త స్థాయికి చేరుకున్నామని తెలిపారు. ఏ కొండూరు కూడా ఆకాంక్షిత బ్లాకుల తరహాలో అభివృద్ధి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఐఆర్డీ సీనియర్ కన్సల్టెంట్ డాక్టర్ మహమ్మద్ ఖాన్, డి ఆర్ ఒ లక్ష్మీ నరసింహం, డిఆర్డిఏ పిడి నాంచారావు, డీఎంహెచ్వో సుహాసిని వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఇంద్రకీలాద్రిపై పాము కాటు కలకలం

ఉచిత క్యూలైన్‌లో పాము కాటేయడంతో భక్తులు తీవ్ర భయాందోళన చెందుతున్నారు. వివరాల్లోకి వెళితే ఇంద్రకీలాద్రి పై దుర్గమ్మ దర్శనార్థం రేపల్లె కు చెందిన భక్తులు కొండపైకి వచ్చారు. ఓం టర్నింగ్ వద్దనుంచి ఉన్న ఉచిత క్యూలైన్ ద్వారా అమ్మవారి దర్శనానికి వెళ్ళారు. అయితే క్యూలైన్ నుంచి బయలుదేరగానే అడుగున్నర ఉన్న పాము రేపల్లెకు చెందిన శ్రీనివాసరావు అనే వ్యక్తిని కాలిపై కాటేసింది. అయితే హుటాహుటిన అటు పోలీసులు దేవస్థానం సిబ్బంది స్పందించి అంబులెన్స్‌లో ప్రభుత్వాసుపత్రికి తరలిం చారు. ఈ సమయంలో క్యూలైన్‌లో ఉన్న భక్తులు అక్కడ నుంచి భయం భయంతో పరుగులు తీశారు. అయితే ఆస్పత్రిలో భక్తుడికి చికిత్సను అందిం చిన వైద్యులు అది విషపూరితమైన పాము కాదని నిర్ధారించారు. పాము కాటుకు గురైన వ్యక్తికి వైద్యం అందించి 24 గంటల పాటు అబ్జర్వేషన్ లో ఉంచి చికిత్స అందిస్తున్నారు.

**అధికారుల నిర్లక్ష్యంగానే పాముల సంచారం...** వర్షాలు పడుతున్న సమయంలో కొండపైన అమ్మవారి సన్నిధి పరిసర ప్రాంతాల్లోనే పాముల సంచారం అధికంగా ఉంటుంది. గతం నుంచి పాముల సంచారం కొండపైన ఉన్న ఎప్పుడు కాటేసే పరిస్థితి రాలేదని భక్తులు వాపోతున్నారు. కాని ప్రస్తుతం భక్తుడిని పాము కాటేయడంతో దుర్గగుడి అధికారుల నిర్లక్ష్యమనేది బయటపడుతోంది. రెండు రోజుల క్రితం డ్యూటీలో ఉన్న వ్యక్తికి పాము కనిపించడం దానిని పట్టుకొనే క్రమంలో కనిపించకుండా పోవడం జరిగింది. ఇదిలా ఉంటే ఒకవైపు వర్షాలు పడుతుండడం మరోవైపు కొండపై నుంచి పాములు కొండ దిగువకు వస్తుండడంతో అధికారులు జాగ్రత్తలు పాటించాలని భక్తులు కోరుతున్నారు. కాని ఆ చర్యలు తీసుకోకపోవడం వలనే భక్తుడిని కాటేసాదాక వచ్చిందని భక్తులు పేర్కొంటున్నారు. మరలా ఇలాంటివి జరగకుండా తగుజాగ్రత్తలు తీసుకోవాలని కోరుతున్నారు భక్తులు. చూదాలి ఇప్పటికైనా దుర్గగుడి అధికారులు ఏ మేరకు చర్యలు తీసుకుంటారోనని.

## దోమల నిర్మూలనకు విస్తృతమైన చర్యలు



**విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్ :** కమిషనర్ ఆదేశాల మేరకు దోమల నిర్మూలనకై విస్తృతమైన చర్యలు చేపట్టారు ప్రజారోగ్యం మలేరియా సిబ్బంది. అందులో భాగంగా బుధవారం కోటి నగర్, రామకృష్ణాపురం, అజిత్ సింగ్ నగర్, గాంధీనగర్ ప్రాంతాలన్నీ బయాలజిస్ట్ వి. కామేశ్వరరావు పర్యటించి క్షేత్రస్థాయిలో ఏ ఎల్ ఓ(యాంటీ లార్వా ఆపరేషన్స్), పి డి పి (పెరి డొమెస్టిక్ ప్లేసెస్)చర్యలు చేపట్టారు. యాంటీ లార్వా ఆపరేషన్లలో భాగంగా కల్వర్ట్ లో ఫాగింగ్, సైడ్ డ్రైన్ల లో ఎంఎల్ ఆయిల్స్ స్ప్రే, బుడమేరు కాలువలో గుర్రపు డెక్కలను బోట్ల సహాయం తో తొలగించి, ఏలూరు కాలువలో పేరుకుపోయిన వ్యర్థాలను ట్రక్సర్ మెషిన్లతో తొలగించి, నీటి ప్రవాహానిలో ఎటువంటి ఆటంకం లేకుండా దోమల నిర్మూలన కై చర్యలు తీసుకున్నారు. ఆ ప్రాంతాలలో ప్రజలు నివసిస్తున్న ఇళ్ల పరిసరాలలో ఉన్న డ్రమ్ములలో, పూల కుండీలలో, ఖాళీ స్థలాలలో, టైరులలో, ట్యాంకులలో నిల్వ నీరును తొలగించి పిడిపి (పెరి డొమెస్టిక్ ప్లేసెస్ ) చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా బయాలజిస్ట్ వి. కామేశ్వరరావు మాట్లాడుతూ ప్రతిరోజు ఇటువంటి యాంటీ లార్వే ఆపరేషన్లు, పి డిపి ఆక్టివిటీలు నగరం మొత్తం క్రమ తప్పకుండా చేసుకొస్తున్నారని, తద్వారా దోమలను నిర్మూలించి ప్రజలకు ఆరోగ్యకరమైన వాతావరణం అందిస్తున్నారని తెలిపారు.

# రెవెన్యూ సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి



(మొదటిపేజీ తరువాయి)

శ్రీదేవితో కలిసి రెవెన్యూ అధికారుల సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో ప్రధానంగా ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న వివిధ సేవలపై సానుకూల ప్రజా దృక్పథం ఇంటరాక్టివ్ వాయిస్ రెస్పాన్స్ సిస్టమ్ - ఐవిఆర్ఎస్ నివేదిక, ప్రజా సమస్యల పరిష్కార వేదిక అర్జీలు, భూమి పరాయీకరణ, భూసేకరణ సమస్యలు, అందరికీ ఇళ్ళు, శ్మశాన వాటికలు, వాట్స్ యాప్ సూచనలు, కోర్టు కేసులు, సీనియర్ సిటిజన్స్ కేసులు, ధాన్యం సేకరణ, స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ, రీసర్వే పురోగతి, ప్రభుత్వ ఉద్యోగుల హెల్త్ కార్డులు, ఉద్యోగుల ఫిర్యాదులు గ్రీవెన్స్ ఐ గాట్ కర్మయోగి, బ్యాంకు ఖాతాలకు రాష్ట్ర ప్రభుత్వ జీత ప్యాకేజీ అప్డేట్ తదితర అంశాలపై ఉదయం నుంచి సాయంత్రం వరకు రెండు సెషన్ లుగా సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ తహసిల్దార్లు వారి మండల పరిధిలో అపరిష్కృతంగా ఉన్న సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. అందరికీ ఇళ్లు కార్యక్రమంలో భాగంగా, రాష్ట్ర ప్రభుత్వం గ్రామాలలో మూడు సెంట్లు, పట్టణ ప్రాంతాలలో రెండు సెంట్ల ఇళ్ల స్థలాలు మంజూరు చేస్తున్న నేపథ్యంలో అర్హత గల లబ్ధిదారులను గుర్తించి ప్రభుత్వం రూపొందించిన నిబంధనల ప్రకారం ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలన్నారు. తాసిల్దారులు వారి వీఆర్వోలు, సర్వేయర్లతో కలిసి ప్రస్తుతం జిల్లాలో ఉన్న లేఅవుట్లను క్షేత్రస్థాయిలో సందర్శించి ఖాళీలను గుర్తించాలన్నారు.పొలాలు, ఇళ్ల స్థలాలకు సర్వే చేయాలని అర్జీ పెట్టుకున్న దరఖాస్తుదారుల విషయంలో నిర్లక్ష్యం సరికాదని సర్వేయర్లకు సూచించారు. సర్వే చేసిన అనంతరం రాష్ట్ర స్థాయిలో లబ్ధిదారులకు ఫోన్ లో ఐవిఆర్ఎస్ ద్వారా.. సర్వేయర్లు వచ్చి మీ భూమికి సర్వే చేశారా, సర్వేకు ముందు నోటీసు ద్వారా లేదా ఫోన్ ద్వారా తెలియజేశారా లేదా, సర్వే సమయంలో సిబ్బంది డబ్బులు డిమాండ్ చేశారా వంటి విషయాలపై అభిప్రాయాలు తెలుసుకొని అర్జీదారులు ఇచ్చే సమాధానం ఆధారంగా జిల్లాకు ర్యాంకులు కేటాయిస్తున్నారన్నారు. ఈ విషయంలో సర్వేయర్లు జాగ్రత్తగా ఉండాలని, ఎలాంటి అవకతవకలకు తావు ఉండకూడదని ఈ సందర్భంగా కలెక్టర్ హెచ్చరించారు.మీకోసం అర్జీలు పరిష్కరించడంపై అధికారులు అవగాహన కలిగి ఉండాలన్నారు. అర్జీదారునికి ఎండార్స్మెంట్ బాగానే చేస్తున్నప్పటికీ ఆన్లైన్లో అప్లోడ్ చేసే సమయంలో సరియైన ఆప్షన్ను ఎంచుకొని సమర్పించడం లేదని, దీనివల్ల దరఖాస్తు తిరిగి రీఓపెన్ అవుతుందన్నారు. అర్జీను పూర్తిగా పరిష్కరిస్తేనే ఆన్లైన్ పోర్టల్ లో సిటిజెన్ బెనిఫిటెడ్ అనే ఆప్షన్ ను ఎంచుకొని సమర్పించాలన్నారు. అలా కాకుండా సమస్య రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో ఉంటే గనక సిటిజెన్ యెట్ టు బి బెనిఫిటెడ్ అనే ఆప్షన్ను ఎంచుకొని సమర్పించాల్సి ఉంటుందని, తప్పులు పునరావృతం కాకుండా ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు.జిల్లాలో ధాన్యం సేకరణ అత్యంత ప్రాధాన్యత అంశమని,గత ఏడాది ఖరీఫ్ సీజన్లో కొన్ని ఇబ్బందులు పడ్డామని గుర్తు చేస్తూ, ఈసారి అలాంటి పొరపాట్లకు అవకాశం ఇవ్వకుండా ముందుగానే అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. ముఖ్యంగా తగినన్ని గోనె సంచులు సిద్ధం చేసుకోవడం, రవాణ వాహనాలను సమకూర్చుకోవడం పక్కాగా ఉండాలన్నారు. జీపీఎస్ వ్యవస్థ కలిగిన వాహనాల రిజిస్ట్రేషన్ త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. రైతుల సౌకర్యార్థం ధాన్యం సేకరణకు సంబంధించిన అధికారుల ఫోన్ నంబర్లను మిల్లులతో పాటు ఆర్ ఎస్ కె ల వద్ద ప్రదర్శనగా ఉంచాలని సూచించారు.ప్రస్తుతం జిల్లాలో 312 రైతు సేవా కేంద్రాల (ఆర్ ఎస్ కె) ద్వారా ధాన్యం కొనుగోలు జరుగుతుందని, సుమారుగా 8 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వచ్చే అవకాశం ఉందని, 99 శాతం ఈ పంట నమోదు పూర్తయినట్టు జాయింట్ కలెక్టర్ తెలిపారు.లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ పూర్తి చేయాలన్నారు. ప్రస్తుతం జిల్లాలో 5,17,835 కార్డులకు 4,75,549 కార్డులు పంపిణీ చేశారని, మిగిలిన 42,286 కార్డుల పంపిణీ తరితగతిన పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ సంబంధిత అధికారులకు సూచించారు. ప్రభుత్వ ఉద్యోగులు తమ బ్యాంకు ఖాతాలను రాష్ట్ర ప్రభుత్వ జీత ప్యాకేజీకు అప్డేట్ చేయించుకోవాలని, దీనివల్ల ఉచిత బీమా వంటి ఎన్నో వ్యక్తిగత ప్రయోజనాలు పొందవచ్చన్నారు. ఇంకా 119 మంది ఉద్యోగులు చేసుకోవాల్సి ఉందని, మిగిలిన వారు కూడా సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. అదేవిధంగా ఉద్యోగుల ఆరోగ్య పథకం ఈహెచ్ఎస్లో ప్రతి ఒక్కరూ నమోదు చేసుకోవాలని, కార్డులు డౌన్లోడ్ చేసుకోనివారు ఇంకా 125 మంది ఉద్యోగులు ఉన్నారని, అనుకోని పరిస్థితుల్లో ఇది ఎంతో అక్కరకొస్తుందని గుర్తు చేశారు.జిల్లాలో జరుగుతున్న 3వ దశ రీసర్వే త్వరితగతిన పూర్తి చేయాలని సూచిస్తూ క్షేత్ర స్థాయిలోని సమస్యలపై ఆరా తీశారు. గ్రౌండ్ ట్రూతింగ్, గ్రౌండ్ వాలిడేషన్,13వ నోటిఫికేషన్ జారీ చేయడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, అవసరమేరకు అదనపు సిబ్బందిని డిప్యూటేషన్ పద్ధతిలో నియమించుకోవాలని జాయింట్ కలెక్టర్ సంబంధిత అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో మచిలీపట్నం, గుడివాడ, ఉయ్యూరు ఆర్డీవోలు కే స్వాతి, జి బాలసుబ్రమణ్యం, బివిఎస్ హేలా షారోన్, సర్వే ఏడి జోషిలా, విజిలెన్స్ డిప్యూటీ కలెక్టర్ ఇంచార్జ్ జిల్లా గృహ నిర్మాణ సంస్థ అధికారి పోతురాజు,డీఎస్ఓ జి మోహన్ రావు, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ టి శివరాం ప్రసాద్, తదితర శాఖల జిల్లా అధికారులు, తహసిల్దార్లు, డిప్యూటీ తహసిల్దార్లు, సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ సమైక్యతకు స్ఫూర్తి సర్దార్ వల్లభాయ్ పటేల్



**విజయవాడ మేజర్ న్యూస్ :** జాతీయ సమైక్యత దినోత్సవాన్ని పురస్కరించుకొని సర్దార్ @ 150 లో భాగంగా దేశవ్యాప్తంగా అతిపెద్ద ప్రచార యాత్ర ప్రారంభించటం గర్వంగా ఉందని కేంద్ర క్రీడలు, యువజన సంక్షేమం, మై భారత్ రాష్ట్ర సంచాలకులు అన్నుమన్ ప్రసాద్ దాస్ తెలిపారు. నగరంలోని స్థానిక కలెక్టరేట్ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని దేశవ్యాప్తంగా నిర్వహించే ప్రత్యేక ప్రచార కార్యక్రమాల్లో భాగంగా బుధవారం రాష్ట్రంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో మై భారత్ రాష్ట్ర సంచాలకులు అన్నమన్ ప్రసాద్ దాసు మాట్లాడుతూ భారత చరిత్రలో ఇంతకుముందెన్నడూ లేనివిధంగా సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి రోజైన 31 అక్టోబర్ నుంచి నవంబర్ 25 వరకు అతి పెద్ద ప్రచారయాత్ర నిర్వహించడం జరగుతుందన్నారు. యువతలో ఐక్యత, దేశభక్తి భావాన్ని పెంపొందించే విధంగా అక్టోబర్ నెలలో దేశవ్యాప్తంగా అన్నిరాష్ట్రాలు, జిల్లాలలో సర్దార్ @ 150 యూనిటీ మార్చ్ ను నిర్వహించడం జరుగుతుందన్నారు.

ఐరన్ మ్యాన్ ఆఫ్ ఇండియా (భారత ఉక్కు మనిషి) గా భారతీయ ఐక్యతను చాటి చెప్పే విధంగా ఆయన చేసిన త్యాగాలను మరువలేమన్నారు. ఈనెల ఆరవ తేదీన కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రి డా. మన్సుఖ్ మాండవియా దేశవ్యాప్తంగా సర్దార్ @ 150 యంగ్ లీడర్స్ ప్రోగ్రాం క్విజ్ లలో భాగంగా డిజిటల్ దశను ప్రారం భించారన్నారు. దేశవ్యాప్తంగా యువత సోషల్ మీడియా రీల్ కాంపిటీషన్లు, వ్యాస రచన పోటీలు, క్విజ్ పోటీలలో చురుకుగా పాల్గొంటున్నారన్నారు. దేశంలో ఎంతో మంది ప్రముఖ నేతలున్నా మనకు నేతాజీ, సర్దార్ వల్లభాయ్ పటేల్ లాంటి నాయకులే మనకు గుర్తుకువస్తారన్నారు.

### అక్టోబర్ 31 నుండి నవంబర్ 25 వరకు పాదయాత్రలు

రాష్ట్ర యువజన సర్వీసుల శాఖ ఉపసంచాలకులు ఎస్వీడీఎస్ రామకృష్ణ మాట్లాడుతూ ఏక్ భారత్, శ్రేష్ఠ భారత్ లో భాగంగా స్థానిక సంస్కృతి, వైవిధ్యాలను ప్రతిబింబించే విధంగా పట్టణాలు, గ్రామాలలో ఈ నెల 31 నుండి నవంబర్ 25 వరకు పాదయాత్రలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ముఖ్యంగా ప్రచార కార్యక్రమాల్లో భాగంగా యోగా, ఆరోగ్య శిబిరాలు, అవగాహన కార్యక్రమాలు, మత్తు రహిత భారత ప్రతిజ్ఞలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ ప్రచారయాత్రలో కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రదర్శన నిర్వహిస్తామని, స్వచ్ఛత డ్రైవ్ లు, మై భారత్ వాలంటీర్లు, ఎన్ఎస్ఎస్ క్యాడెట్స్, ఎన్ఎస్ఎస్ యువత చురుకుగా పాల్గొంటారన్నారు.

ఎన్ఎస్ఎస్ రాష్ట్ర అధికారి డాక్టర్ ఎం. సుధాకర్ మాట్లాడుతూ జిల్లా స్థాయిలో పార్లమెంటు సభ్యులు, పాఠశాలలు, కళాశాల విద్యార్థులు, వృద్ధులు, రిటైర్డ్ అధికారులు, క్రీడాకారులు వెటరన్స్, యువత ఈ ప్రచార యాత్రలో పెద్దఎత్తున పాల్గొంటారన్నారు. ఆత్మ నిర్భర్ భారత్ స్ఫూర్తిని ప్రతిబింబించే విధంగా ప్రతి జిల్లాలో 8 కి.మీ నుంచి 10 కిలోమీటర్లు వరకు ప్రచార యాత్ర నిర్వహిస్తామన్నారు. మై భారత్ పోర్టల్ లో విద్యార్థులు తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. సర్దార్ ఏ 150 ఐక్యతా మార్చ్ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మై భారత్, జిల్లా యువజన అధికారి సుంకర రాము, జిల్లా యువజన సంక్షేమ శాఖ సీఈవో యు. శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

# ఐనపూరు హైస్కూల్ విద్యార్థులకు క్రీడా దుస్తులు బహుకరణ



**పమిడిముక్కల మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని ఐనపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు దాతల సౌజన్యంతో క్రీడా దుస్తులను బహూకరించారు. సుమారు పదివేల రూపాయలు విలువతో కూడిన క్రీడా దుస్తులను 22 మంది విద్యార్థులు విద్యార్థులకు బుధవారం అందజేశారు. మండలంలోని నారాయణపురం గ్రామ వాస్తవ్యులు స్వర్గీయ కూచిభట్ల వెంకటేశ్వర అవధాని కుమారులు ప్రవాసాంధ్రులు కూచిభట్ల కిరణ్ కుమార్, పవన్ కుమార్ ల దాతృత్వంతో వీటిని సమకూర్చారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో దాతలు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులలో క్రీడల యందు మరింత ఆసక్తిని పెంచడానికి, విద్యార్థులందరూ చదువుతోపాటు క్రీడలలో కూడా మంచి ప్రావీణ్యం సాధించడానికి ఉపయోగపడే విధంగా ప్రోత్సహించాలనే ఉద్దేశంతో పాఠశాల విద్యార్థులకు క్రీడా దుస్తులు బహుకరించినట్లు తెలిపారు. ఈసందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు తమ్మన వేణుగోపాలరావు మాట్లాడుతూ విద్యార్థులకు క్రీడా దుస్తులు అందజేసిన దాతలకు తమ పాఠశాల విద్యా కుటుంబం అందరి తరపున కృతజ్ఞతలు తెలియజేశారు. దాతలు కోరినట్లుగానే, చదువుతోపాటు క్రీడలలో కూడా తమ విద్యార్థులు మరింత ముందుండే విధంగా కృషి చేస్తామని పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ కోటగిరి ఫణీంద్ర తెలిపారు. ఈకార్యక్రమంలో పాఠశాల ఎస్ఎంసి కమిటీ చైర్మన్ దూడల శివ నాగ భవాని, ఐనపూరు గ్రామ సర్పంచ్ కొండా జయలక్ష్మి – బసివిరెడ్డి దంపతులు, కూడేరు గ్రామ సర్పంచ్ వీర్ల నాగరాజు, కూడేరు ఎంపీటీసీ సభ్యులు వీర్ల ఆదిశేషు పాల్గొని దాతలను అభినందించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యార్థినీ విద్యార్థులు, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.



## నకిలీ మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవు

**పెడన, మేజర్ న్యూస్:** పట్టణంలోని మద్యం దుకాణాలలో బుధవారం రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన సురక్ష యాప్ ద్వారా మద్యం బాటిల్స్‌పై ఉన్న క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి నకిలీవో, నిజమైనదో అనే విషయాన్ని నియోజకవర్గ ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ స్వయంగా పరిశీలించారు. ఈ మేరకు ఆయన పట్టణంలోకి రా ఒక మద్యం దుకాణంలో సీసాలను వాటిపై ఉన్న లేబుల్స్, క్యూ ఆర్ కోడ్ ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, మద్యం విక్రయాల్లో నకిలీ బాటిల్స్‌పై నియంత్రణకు ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటోందని తెలిపారు. సురక్ష యాప్ ద్వారా ప్రతి వినియోగదారుడు కూడా బాటిల్‌పై ఉన్న క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి ఆ మద్యం నిజమైనదో కాదో సులభంగా తెలుసుకోవచ్చు అని ఆయన పేర్కొన్నారు. అలాగే మద్యం దుకాణ యజమానులు ప్రభుత్వ నిబంధనలను కచ్చితంగా పాటించాలని, నకిలీ మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ శాఖ అధికారులు, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ అబ్దుల్ ఖయ్యూం (హన్ను ) టిడిపి మండల ప్రధాన కార్యదర్శి సీరం ప్రసాదు, జడ్పిటిసి అజ్జా నగేష్ పడమటి టిడిపి అధ్యక్షుడు ఎక్కల శ్యామలరావు, పరస జితేంద్ర,అజీమ్, తదితరులు ఉన్నారు.

## చల్లపల్లిలో కుండపోత వర్షం



**చల్లపల్లి, మేజర్ న్యూస్ :** అల్పపీడన ప్రభావంతో బుధవారం చల్లపల్లి మండలంలో కుండ పోతగా వర్షం కురిసింది. ఉదయం 10 గంటలు దాటిన తర్వాత ప్రారంభమైన వర్షం కుండపోతగా కురవగా, కొద్దిసేపు విరామంతో తిరిగి మళ్లీ కురవటం ఇలా వర్షం కురుస్తూనే ఉంది. భారీ వర్షంతో రోడ్లన్నీ జలమయం అయ్యాయి. పల్లపు ప్రాంతాల్లో నీరు నిలిచిపోయింది. మట్టిరోడ్లు బురదకయ్యలుగా మారాయి. అంతర్గత రహదారులపై వర్షపునీరు నిలిచింది. వర్షంతో జనజీవనం అస్తవ్యస్తంగా మారింది.

## ఘనంగా మాజీ ఎమ్మెల్యే వంశీ పుట్టినరోజు వేడుకలు



**గన్నవరం, మేజర్ న్యూస్ :** గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ జన్మదిన వేడుకలను మండల వ్యాప్తంగా వైసీపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఉంగుటూరు మండలం నందమూరులో వైసీపీ యువనాయకు డు చలివేంద్ర రామకృష్ణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆర్ కె.కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేసారు. ఈ సందర్భంగా జై వంశీ, జైజై వంశీ అనే నినాదాలతో యువత హోరెత్తించారు. అనంతరం ఆర్ కె మాట్లాడుతూ పేదల పెన్నిధి అయినా వంశీ మరెన్నో పుట్టినరోజు వేడుకలు జరుపుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ వైసీపీ నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

## రోడ్డు సైడ్ వ్యాపారుల కష్ట సుఖాలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కాగిత



**పెడన, మేజర్ న్యూస్ :** పట్టణంలో పర్యటిస్తూ రోడ్డు పక్కన గల చిరు వ్యాపారులను పలకరిస్తూ వారి కష్ట సుఖాలు అడిగి తెలుసుకొని ఆర్థిక సమస్యలు పరిష్కరించే విధముగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని నియోజకవర్గ ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ అన్నారు. ఈ మేరకు స్థానిక బస్టాండు ఎదురుగా గల ఒక టీ స్టాల్ వద్ద టీ తాగుతూ స్థానికులతో ముచ్చటించారు. ప్రజా సమస్యలు ఏమైనా నేరుగా తన దృష్టికి తీసుకురావచ్చు అని దాని పరిష్కార దిశగా వెంటనే అధికారులను సంప్రదిస్తానని స్థానికులకు తెలిపారు. మంచి ప్రణాళికను రూపొందిస్తామని వెల్లడించారు ఈ కార్యక్రమంలో పట్టణ టిడిపి నాయకులు తదితరులు ఉన్నారు.

# వైసీపీ జిల్లా ఎస్సీ సెల్ ఉపాధ్యక్షునిగా మహేష్, మహిళా విభాగం జిల్లా కార్యదర్శిగా పద్మ



**పమిడిముక్కల మేజర్ న్యూస్ :** పమిడిముక్కల మండలానికి చెందిన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇరువురు జిల్లాస్థాయి పార్టీ పదవులలో నియమితులయ్యారు. మండల పరిషత్ ఉపాధ్యక్షులు, హనుమంతపురం గ్రామ ఎంపిటిసి సభ్యులు అయిన కొడమంచిలి మహేష్ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కృష్ణాజిల్లా ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులుగా నియమితులయ్యారు. కృష్ణాజిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడిగా తనను నియమించడానికి కృషి చేసిన పామర్రు నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు రాష్ట్ర అధికార ప్రతినిధి కైలే అనిల్ కుమార్, రాష్ట్ర ఎస్సీ సెల్ అధ్యక్షులు టి.జె.ఆర్.సుధాకర్ బాబు, కృష్ణాజిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు పేర్ని వెంకటరామయ్య (నాని), కృష్ణాజిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు మట్టా జాన్ విక్టర్ లకు ఈ సందర్భంగా



కొడమంచిలి మహేష్ కృతజ్ఞతలు తెలిపారు. అలాగే మండల పరిధిలోని గోపువానిపాలెం గ్రామానికి చెందిన కోలవెన్ను పద్మ కృష్ణా జిల్లా మహిళా విభాగం కార్యదర్శిగా నియమితులయ్యారు. ఈ మేరకు ఈ నియామకాలకు సంబంధించిన ఉత్తర్వులను రాష్ట్ర పార్టీ కార్యాలయం విడుదల చేసింది. పామర్రు నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి కైలే అనిల్ కుమార్ ఆశీస్సులతో తనకు ఈ పదవి లభించిందని ఈ సందర్భంగా పద్మ పేర్కొన్నారు. బిసి వర్గానికి చెందిన తనను ఈ పదవికి ఎంపిక చేయటం పట్ల ఆమె హర్షం వ్యక్తం చేస్తూ అనిల్ కుమార్ కు కృతజ్ఞతలు తెలిపారు. రానున్నకాలంలో పార్టీని మరింత బలపరిచేందుకు తన వంతు కృషి చేసి తనకు ఇచ్చిన పదవికి న్యాయం చేకూరుస్తామని పేర్కొన్నారు.



## దీపావళి సందర్భంగా ఎన్ఎస్ఈ ఎండి, సీఈవో ఆశిష్ కుమార్ చౌహాన్ ట్వీట్

**విజయవాడ, అక్టోబర్ 22, మేజర్ న్యూస్ :** ఎన్ఎస్ఈ ఎండి, సీఈవో ఆశిష్ కుమార్ చౌహాన్ ట్విట్టర్ వేదికగా దీపావళి ముహూర్తం ట్రేడింగ్21 అక్టోబర్ 2025 సందర్భంగా “ముహురత్ ట్రేడింగ్ అనేది విశ్వాసం, జ్ఞానం, క్రమశిక్షణతోమన ఆర్థిక ప్రయాణాన్ని రూపొందించే సమయం. పెట్టుబడి అంటే కేవలం సంపదను సృష్టించడం మాత్రమేకాదు, భారతదేశం యొక్క అద్భుతమైన ఆర్థిక వృద్ధి గాథలో భాగం కావడం కూడా.”ఎక్కువ మంది ప్రజలు మూలధన మార్కెట్లలో ప్రవేశిస్తున్న సమయంలో,విశ్వాసాన్ని పెంపొందించడానికి, దీర్ఘకాలిక శ్రేయస్సును సాధించడానికి పెట్టుబడిదారుల అవగాహన, సమాచార ఆధారిత నిర్ణయాలు తీసుకోవడం చాలా కీలకం. నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్లో, ప్రతి పెట్టుబడిదారుడు విశ్వా, యుబాధ్యతతో వృద్ధి చెందగల పారదర్శకమైన, సమ్మిళిత వాతావరణాన్ని పెంపొందించడం పట్ల మే ము నిబద్ధతగా ఉన్నాము. కొత్త ప్రారంభాల స్ఫూర్తితో, జ్ఞానం మన ఎంపికలకు మార్గనిర్దేశంచేస్తుంది, విజయం మన సొంతమవుతుంది. ఈ పండుగ ప్రతి ఒక్కరికీ సంపద, ఆరోగ్యం, ఆనందం,శాంతిని తీసుకురావాలని కోరుకుంటూ, అందరికీ దీపావళి శుభాకాంక్షలు,” అని ట్వీట్ చేశారు.

## వైసీపీ ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ



**పామర్రు మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని నిమ్మలూరు, మలయప్పన్ పేట, కొరిమెర్ల గ్రామాలలో బుధవారం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. మాజీ శాసన సభ్యులు కైలే అనిల్ కుమార్ ఆదేశాల మేరకు ఆ పార్టీ నాయకులు ఆయా గ్రామాలలో పర్యటించి ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సంతకాల సేకరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి దాసరి అశోక్ కుమార్, జడ్పిటిసి సభ్యురాలు కూనపురెడ్డి స్వరూపరాణి, మండల పరిషత్ ఉపాధ్యక్షులు ఆరేపల్లి శ్రీనివాసరావు, ఆరుమళ్ళ రమాదేవి, జిల్లా ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు తాడిశెట్టి శ్రీనివాసరావు లతో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పలు గ్రామాలలో కోటి సంతకాల సేకరణ చేపట్టిన వైసీపీ నాయకులు



**పమిడిముక్కల మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని మర్రివాడ, ఐనంపూడి, చోరగుడి, గ్రామాలలో మాజీ శాసనసభ్యులు కైలే అనిల్ కుమార్ ఆదేశాలమేరకు ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. మండల పార్టీ అధ్యక్షులు యలమంచిలి గణేష్ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమంలో మండల వైస్ ఎంపీపీలు కొడమంచిలి మహేష్, గంజాల సీతారామయ్య, మర్రివాడ, పమిడి ముక్కల ఎంపీటీసీ సభ్యులు ఒబా మల్లేశ్వరి, గుర్విందపల్లి వంశీ, అగినపర్రు, ఐనంపూడి గ్రామ సర్పంచ్‌లు కోట మణిరాజు, ఏనుగ వెంకటేశ్వరరావు, వాలంటరీ విభాగం జిల్లా అధ్యక్షులు పోలిమెట్ల వంశీకృష్ణ, మండల పార్టీ ఉపాధ్యక్షులు బొల్లా సాంబశివరావు, పాతూరి చంద్రపాల్, మండల పార్టీ ప్రధాన కార్యదర్శులు గొరికిపూడి బుజ్జి, కనుమూరి వెంకటేశ్వరరావు, కోడిబోయిన కోటేశ్వరరావు, నియోజకవర్గ క్రిస్టియన్ మైనార్టీ అధ్యక్షులు ఇజం, ముస్లిం మైనార్టీ అధ్యక్షులు అబ్దుల్, డాక్టర్స్ విభాగం నియోజకవర్గ యాక్టివిటీ కార్యదర్శి దిట్టకవి శ్రీనివాసాచార్యులు, మండల కార్యదర్శులు కంభపు లక్ష్మయ్య, కాగిత శ్రీరామమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## నిబంధనలకు విరుద్ధంగా డీజేలు వినియోగిస్తే చట్టప్రకారం చర్యలు తప్పవు

**బందరు డీఎస్పీ సి.హెచ్.రాజా**




**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** బందర్ సబ్ డివిజన్ పరిధిలో వేడుకలకు, ఉత్సవాలకు, ఇతర మరేదైనా కార్యక్రమాలకు డీజేలు వినియోగించడానికి తప్పనిసరిగా పోలీస్ వారి అనుమతి తీసుకోవాలి అని డీఎస్పీ తెలిపారు. సుప్రీంకోర్టు వారి మార్గదర్శకాలకు వ్యతిరేకంగా ఎవరైనా ప్రజలకు ఇబ్బంది కలిగే విధంగా మితిమీరిన శబ్దంతో డీజే లను వినియోగిస్తే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుంది. ఒకవేళ అనుమతి పొంది డీజేలు వినియోగిస్తున్న వారు రాత్రి 10 గంటల నుండి ఉదయం 6 గంటల వరకు ఉన్న సమయాన్ని నిశ్శబ్ద సమయంగా పరిగణించి ఎవరూ కూడా డీజేలను వినియోగించరాదు. డీజే వినియోగించేవారు 75 డేసిబిల్స్ కు మించి శబ్దాన్ని పెట్టరాదు. అలా కాకుండా ఆదేశాలను మీరి అధిక శబ్దాన్ని పెడుతూ శబ్ద కాలుష్యానికి కారణం అవ్వడమే కాక, చుట్టుపక్కల వారికి ఇబ్బంది కలిగేలా వ్యవహరిస్తే వారిపై చర్యలు తీసుకోవడానికి వెనకాడేది లేదు. అలాగే వారి యొక్క డీజే బాక్సును సీజ్ చేసి కేసు నమోదు చేయడం జరుగుతుంది. అని సీ హెచ్ రాజా అన్నారు.

## హైకోర్టు న్యాయమూర్తిని మర్యాదపూర్వకంగా కలిసిన ఎస్పీ



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** హైకోర్టు న్యాయమూర్తి బట్టు దేవానంద్‌ని గుడివాడ ఆయన నివాసంలో జిల్లా ఎస్పీ వి.విద్యాసాగర్ నాయుడు, మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు.

## శ్రీ రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో కార్తీక్ పురాణం ప్రవచనాలు కార్యక్రమం




**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** శ్రీ రామలింగేశ్వర స్వామి దేవస్థానం రాబర్ట్ సన్ పేట మచిలీపట్నంలో బుధవారం నుండి కార్తీక్ మాసం సందర్భంగా నెల రోజులు కార్తీక్ పురాణం ప్రవచనాలు కార్యక్రమం నిర్వహించున్నారు. శ్రీ చింతలపాటి మురళీకృష్ణ పురాణం కార్యక్రమం ప్రారంభించినారు. ఇట సమ్మెట ఆంజనేయస్వామి, ముదిగొండ శాస్త్రి, దేసు సుబ్రహ్మణ్యం, మురళీ, తదితరులు పాల్గొన్నారు

## ఘనంగా నందం వసంత జయంతి



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** ప్రముఖ కథ, నవల రచయిత, పాత్రికేయులు నందం రామారావు ప్రథమ కుమార్తె నందం వసంత జయంతిని బుధవారం మచిలీపట్నం చిలకలపూడిలోని అన్నపూర్ణ వృద్ధాశ్రమంలో ఘనంగా నిర్వహించారు. నందం వసంత పెడన జిల్లా పరిషత్ హై స్కూల్లో ఇంగ్లీష్ ఉపాధ్యాయురాలుగా పనిచేస్తూ ఉండగా కోవిడ్ బారినపడి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ 2022 పరమపదించారు. ఎంతోమంది విద్యార్థులకు విద్యను అందించి వారి బంగారు భవిష్యత్తును తీర్చిదిద్దారు. అక్టోబర్ 22న వసంత 55వ జయంతిని కుటుంబ సభ్యులు ఘనంగా నిర్వహించారు. అనంతరం అన్నపూర్ణ వృద్ధాశ్రమంలో వృద్ధులకు అన్నదానం చేశారు. కరెడ్ల సుశీల, వార్తా ప్రభ రిపోర్టర్ రామకృష్ణ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం జరిగింది.

## సీసీ రోడ్ నిర్మాణానికి శంకుస్థాపన చేసిన టీడీపి శ్రేణులు



**జి.కొండూరు మేజర్ న్యూస్ :** మైలవరం లోని రాజా పేటనందు తెలుగుదేశం పార్టీ నా యకుల ఆధ్వర్యంలో బుధవారం పూజ కార్యక్రమాలు నిర్వ హించి, కొబ్బరి కాయ లు కొట్టి సిసి రోడ్ నిర్మాణాన్ని ప్రారంభించినారు. ఈ సందర్బంగా స్థానికులు ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాద్‌కి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, తెలుగుయువత పాల్గొన్నారు.

# దాల్వా రెండో పంటకు సాగునీరు అందించాలి





**కృష్ణాజిల్లా స్టాఫ్ రిపోర్టర్ మేజర్ న్యూస్ :** పెడన నియోజవర్గంలోని బంటుమిల్లి, కృత్తివెన్ను మండలాల రైతుల విజ్ఞప్తి మేరకు దాల్వా పంటకు సాగునీరు అందించే విషయం జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లామని త్వరలో తగిన నిర్ణయం తీసుకోవడం జరుగుతుందని పెడన శాసనసభ్యులు కాగిత కృష్ణ ప్రసాద్ వెల్లడించారు. బుధవారం మధ్యాహ్నం పెడన శాసనసభ్యులు నియోజకవర్గంలోని రైతులు, సాగునీటి సంఘాల అధ్యక్షులతో కలుసుకొని జిల్లా కేంద్రానికి విచ్చేసి జిల్లా కలెక్టర్ డీకే బాలాజీని నగరంలోని వారి ఛాంబర్లో కలిసి పెడన నియోజకవర్గంలోని రైతులందరూ దాల్వా రెండో పంటకు సాగునీరు అందించాలని కోరుతున్నారని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకొని వచ్చారు. తదనంతరం శాసనసభ్యులు, జిల్లా కలెక్టర్ ఇరువురు జిల్లా కలెక్టర్ చాంబర్ కింద ఉన్న పోర్టికోలో వేచి ఉన్న పెడన నియోజకవర్గ రైతుల వద్దకు వచ్చి మాట్లాడారు. దాల్వా రెండో పంటకు సాగునీరు అందించే విషయమై శాసనసభ్యులు రైతులందరి సమక్షంలో జిల్లా కలెక్టర్కు వినతిపత్రం అందజేశారు. తదుపరి శాసనసభ్యులు మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ నియోజకవర్గంలోని రైతులు రెండో పంట దాల్వా పంటకు సాగునీరు అందించాలని కోరుతున్నారన్నారు. నియోజకవర్గం జిల్లాలో శివారు ప్రాంతమని, సముద్రానికి ఆనుకుని ఉన్న ప్రాంతం అన్నారు. బంటుమిల్లి, కృత్తివెన్ను మండలాల రైతులు రెండో పంట లేకపోతే అక్కడ మినుములు కూడా పండించే పరిస్థితి లేదన్నారు. సముద్రం దగ్గర ఉండటం వలన అక్కడి భూముల్లో ఉప్పునీరు ఎక్కువగా ఉంటుందన్నారు. రెండో పంట వేయకపోతే భూములన్ని పాడైపోయే పరిస్థితి ఉందన్నారు. అందువలన రైతాంగం రెండో పంట కావాలని కోరుతున్నారన్నారు. ఈ విషయమై జిల్లా కలెక్టర్ ని కలిసి వినతి పత్రం అందజేశామన్నారు. జిల్లా కలెక్టర్ దాల్వ పంటకు సాగునీరు అందించే అంశాన్ని పరిశీలించి మంత్రుల దృష్టికి తీసుకుని వెళ్లి త్వరలో తగిన నిర్ణయం తీసుకుంటామని చెప్పారన్నారు. తాను కూడా ఈ సమస్యను రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుతోపాటు రాష్ట్ర గనులు భూగర్భవనరులు ఎక్సైజ్ శాఖ మంత్రివర్యులు కొల్లు రవీంద్ర దృష్టికి తీసుకుని వెళ్లి తప్పకుండా దాల్వా పంటకు సాగునీరు అందించేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు.

# వ్యక్తుల మధ్య గొడవలను కులాలకు ఆపాదించడం సరికాదు

**అభివృద్ధిని చూసి ఓర్వలేక వైసీపీ విష ప్రచారాలు**

**జనసేన పార్టీ మచిలీపట్నం నగర అధ్యక్షుడు గడ్డంరాజు**



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ లోని కందుకూరులో జరిగిన లక్ష్మి నాయుడు హత్య కేసు పరిశోధనను ప్రత్యేక ట్రిబ్యునల్ తో దర్యాప్తు వేగవంతం చేయాలని ఆదేశించిన కూటమి ప్రభుత్వం ముఖ్యమంత్రి చంద్రబాబు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక వైసీపీ విష ప్రచారాలు చేస్తుందని జనసేన పార్టీ నగర అధ్యక్షుడు గడ్డం రాజు విమర్శించారు. కులాల మధ్య విద్వేషాలు రేపే ప్రయత్నం వైసీపీ పార్టీ చేస్తుందని మండిపడ్డారు. వ్యక్తుల మధ్య గొడవలను కులాలకు ఆపాదించడం సరికాదని అభివృద్ధిని చూసి ఓర్వలేక ఈ రకమైన కుట్రలకు వైసీపీ నాయకులు పూనుకున్నారని అన్నారు. కులాల కతీతంగా పవన్ కళ్యాణ్ జనసేన పార్టీ స్థాపించారని అన్ని వర్గాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ప్రణాళికలు రచిస్తూ ముందుకు వెళుతుందని జనసేన పార్టీ సిద్ధాంతాలు కూటమి ప్రభుత్వంలో, ఆచరణలోకి వస్తున్నాయని గడ్డంరాజు అన్నారు. రాష్ట్ర అభివృద్ధి కోసం చంద్రబాబు పవన్ కళ్యాణ్ అహర్నిశలు శ్రమిస్తున్నారని, జగన్మోహన్ రెడ్డి శకుని కుతంత్రాలు పనిచేయవని, కులం ముసుగులో వైసీపీకి లబ్ధిచేయాలని చూస్తూ జనసేనపార్టీ పవన్ కళ్యాణ్ పై విషం చిమ్ముతున్న నాయకులు తమ కుతంత్రాలు ఆపకపోతే జనసైనికులు, తమదైన శైలిలో బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ఇటువంటి సంఘటనలు జరగడం అత్యంత విచారకరమని మృతుని కుటుంబానికి, గాయపడిన వారికి ప్రభుత్వం ఆర్థిక సాయంతో పాటు భూమిని, పిల్లల చదువులకు బాధ్యత తీసుకోవడం జరిగిందని అన్నారు. విచారణ వేగంగా జరిగేందుకు ఫాస్ట్ ట్రాక్ కోర్ట్ అప్పగించాలని ఆదేశించడం దోషులను వెంటనే శిక్షించేదుకే అని పేర్కొన్నారు.



## నేడు జరిగే పాలకవర్గ ప్రమాణ స్వీకారోత్సవాన్ని జయప్రదం చేయాలి

**మచిలీపట్నం అర్బన్ బ్యాంక్ ఛైర్మన్ దిలీప్ కుమార్**

**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** మచిలీపట్నం కో–ఆపరేటీవ్ అర్బన్ బ్యాంక్ పురోభివృద్ధికి తమవంతు కృషి చేస్తామని నూతనంగా ఏర్పడిన బ్యాంక్ పాలకవర్గం తెలిపింది. ఈ నెల 23వ తేదీన నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారం చేయనున్న నేపథ్యంలో ఛైర్మన్ దిలీప్ కుమార్ నేతృత్వంలో బుధవారం స్థానిక ఆర్&బీ అతిథి గృహంలో ఛైర్మన్ దిలీప్ మాట్లాడుతూ కోటి రూపాయల డిపాజిట్ల సేకరణతో తమ పాలకవర్గం ప్రమాణ స్వీకారం చేయబోతుందన్నారు. గతంలో ఒక వెలుగు వెలిగిన అర్బన్ బ్యాంక్ తర్వాత వచ్చిన ప్రభుత్వాల వల్ల ప్రాధాన్యత కోల్పోయింది. ఏ వర్గాల అభ్యున్నతి కోసమైతే బ్యాంక్ ఏర్పడిందో నేడు ఆ వర్గాలన్నీ దూరమైపోయాయన్నారు. గత పాలకవర్గాలు చేసిన తప్పులను తమ పాలకవర్గం చేయదన్నారు. పదవులు తీసుకుని కాలక్షేపం చేయకుండా అంకిత భావంతో పని చేసి బ్యాంక్ పురోభివృద్ధికి కృషి చేస్తామన్నారు. మంత్రి కొల్లు రవీంద్ర సహాయ సహకారాలతో చిరు వ్యాపారులు, మధ్య తరగతి వర్గాలకు తమ బ్యాంకింగ్ సేవలను చేరువ చేస్తామన్నారు. సిబిల్ స్కోర్ తో పని లేకుండా వడ్డీ వ్యాపారుల బారిన పడకుండా చిరు వ్యాపారులకు తమ బ్యాంక్ ద్వారా పెద్ద ఎత్తున రుణాలు అందిస్తామన్నారు. బ్యాంక్ పురోభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమవంతు సహకారం అందించాలని కోరారు. ఈ నెల 23వ తేదీన జరిగే తమ పాలకవర్గ ప్రమాణ స్వీకారోత్సవాన్ని జయప్రదం చేయాలని దిలీప్ కోరారు. ఈ సమావేశంలో డైరెక్టర్లు వేము కోటేశ్వరరావు, నూకల రమాదేవి, గెల్లి అరుణ కుమారి, వంపుగడవల చౌదరి, పోతాబత్తుల పాండురంగారావు, హరికృష్ణ, శ్రీనివాస్, నాగరాజన్ పాల్గొన్నారు.



## శివాలయాల్లో కార్తీకమాస శోభ

**మొవ్వ మేజర్ న్యూస్ :** కార్తీక మాసం ప్రారంభం రోజైనా బుధవారం మండలంలోని వివిధ గ్రామాల్లో గల శివాలయాల్లో తెల్లవారుజాము నుంచి భక్తులతో కార్తీక మాస శోభ సంతరించుకుంది. మండల కేంద్రమైన మొవ్వ శ్రీ బాలా త్రిపుర సుందరి సమేత శ్రీ భీమేశ్వర స్వామి వారి ఆలయంలో ఆలయ అర్చకులు మొవ్వ బుచ్చ రామ రవీంద్రనాథ్ ఠాగూర్ స్వామివారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. కూచిపూడి గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ గంగా బాలా త్రిపుర సుందరి సమేత శ్రీ రామలింగేశ్వర స్వామి వారి ఆలయంలో వేకువ జాము నుంచి భక్తులతో సందడిగా మారింది. అలాగే మండలంలోని యద్దనపూడి, పెదపూడి, బార్లపూడి, చినముత్తేవి, నిడుమోలు, కాజా, కోసూరు గ్రామాల్లోని శివాలయాల్లో కార్తీక మాసం ప్రారంభం రోజు భక్తులతో సందడిగా మారాయి. ఈ సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

# దివిసీమ విద్యాప్రగతికి కృష్ణారావు కృషి మరువలేనిది



**అవనిగడ్డ మేజర్ న్యూస్ :** దివిసీమ విద్యాప్రగతికి కృష్ణారావు కృషి మరువలేనిదని మోపిదేవి ఎంపీపీ రావి దుర్గావాణి అన్నారు. ఉమ్మడి రాష్ట్ర మాజీ మంత్రి, దివిసీమ గాంధీ స్వర్గీయ మండలి వెంకట కృష్ణారావు శత జయంతి వేడుకలు అవనిగడ్డ వంతెన సెంటరులో ప్రతి రోజు ఘనంగా జరుగుతున్నాయి. బుధవారం కృష్ణారావు విగ్రహానికి ఎంపీపీ రావి దుర్గావాణి, సహకార రంగ ప్రముఖులు పరుచూరి అంజియ్య, మాజీ సీడీసీ చైర్మన్ రావి నాగేశ్వరరావు, తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి రావి రత్నగిరి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కృష్ణారావు సేవలు స్మరించుకున్నారు. 1974లో రాష్ట్ర విద్యా శాఖ మంత్రిగా కృష్ణారావు ఈ ప్రాంతంలో విద్యా రంగ ప్రగతికి బాటలు వేశారని తెలిపారు. మండలి వెంకట కృష్ణారావు శత జయంతి కమిటీ, గాంధీ క్షేత్రం, మండలి అభిమానుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలోఎమ్మెల్యే తనయుడు మండలి వెంకట్రామ్, గాంధీ క్షేత్రం కమిటీ కార్యదర్శి మత్తి శ్రీనివాసరావు, ఏఎంసీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు, టిడిపి అవనిగడ్డ మండల అధ్యక్షులు యాసం చిట్టిబాబు, నడకుదుటి జనార్దనరావు, పూషడపు రత్నగోపాల్, సనకా ప్రశాంత్, ఏఎంసీ వైస్ చైర్మన్ రాజనాల వీరబాబు, మోపిదేవి గ్రామ టీడీపీ అధ్యక్షులు జొన్నలగడ్డ రాము, బచ్చు ఆదినారాయణ, విశ్వనాథపల్లి పాప, ఆకుల సీతామహాలక్ష్మి, మోపిదేవి గ్రామ కూటమి నాయకులు వి.పిచ్చేశ్వరరావు, వై.కృష్ణ, జే.ఆర్.కే.ప్రసాద్, నాగార్జున, సుబ్రహ్మణ్యం, అశోక్, సిద్ధార్ధ, రాజు, ఎంవి నాగేశ్వరరావు, జేమ్స్, కే ఎన్ వి నాగేశ్వరరావు, ఏడుకొండలు, వెంకటరమణ బదుగు భారతి, నాని, గొరిపర్తి వీరబాబు, డొక్కు గోవర్ధన్ రావు కే.శివరాజేష్, గోపి, బుజ్జిబాబు, వేణుబాబు, రాజు, ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా వీరమాచినేని 65వ జన్మదిన వేడుకలు




**హనుమాన్ జంక్షన్ మేజర్ న్యూస్ :** పేద ప్రజలకు సేవలందిస్తున్న వీరమాచినేని సత్యప్రసాద్, శ్రీదేవి అభినందనీయులని గన్నవరం నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ దాసరి వెంకట బాలవర్ధనరావు అన్నారు. బుధవారం హనుమాన్ జంక్షన్‌లో వీరమాచినేని సత్యప్రసాద్ జన్మదినం సందర్భంగా జరిగిన సభకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.గత 25 సంవత్సరాలుగా నిస్వార్ధంగా సత్యప్రసాద్, శ్రీదేవి సేవలు అందిస్తున్నారని అన్నారు. సభకు అధ్యక్షత వహించిన కానుమోలు శ్రీ చింతా శీతయ్య జూనియర్ కాలేజి రిటైర్డ్ ప్రిన్సిపాల్ డి వి రమణ మాట్లాడుతూ నిస్వార్ధ సేవకు నిజమైన నిదర్శనం గుర్తింపుగా ప్రజల అభిమానం సత్యప్రసాద్ కు ఉందని అంతకంటే మానవ జన్మకు ఏం కావాలని అన్నారు.ముందుగా తెలుగు దేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు, మాజీ ముఖ్య మంత్రి నందమూరి తారక రామారావు విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.అనంతరం సత్య ప్రసాద్ జన్మదినం సందర్భంగా పలువురు అభిమానులు సత్య ప్రసాద్, శ్రీదేవి దంపతులను ఘనంగా శాలువాలతో పూల దండలతో ముంచెత్తారు.వేలేరు జిల్లా పరిషత్ హైస్కూల్ హెచ్ ఎం కొమ్మా విజయ్ కు జిల్లా స్థాయిలో ప్రతిష్ఠాత్మకమైన పదవి పొందిన సందర్భంగా కొమ్మా విజయ్ దంపతులను సన్మానించి జ్ఞాపికను బహూకరించారు. అలాగే జన్మదినం సందర్భంగా స్రవంతి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిరుపేదలైన నిర్భాగ్యులకు దుప్పట్లు పంపిణీ చేశారు. వ్యాపారం చేసుకునే రాముడు కు తోపుడు బండి, ఇందిరానగర్ కు చెందిన ముత్యాల సువర్ణరాజు కు టిఫిన్ బండి, బాపులపాడు హరిజనవాడకు చెందిన పిల్లా సువర్ణమ్మ కు టిఫిన్ బండి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ దాసరి చేతుల మీదుగా రిబ్బన్ కట్ చేసి అందజేశారు. అలాగే బాపులపాడు జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులకు క్రీడా పరికరాలు, లాబ్ పరికరాలు అందించారు.ఈ కార్యక్రమంలో మెడివ్యాలీ మల్టీ స్పెషాలిటీ హాస్పటల్ ఎం.డి, హనుమాన్ జంక్షన్ లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ పంచకర్ల చక్రవర్తి, మానవత స్వచ్ఛంద సేవా సంస్థ రాష్ట్ర కన్వీనర్ మారుబోయిన కోటేశ్వరరావు, బాపులపాడు మండల విద్యాశాఖ అధికారి రాం బాలా సింగ్, తుమ్మల దశరథ రామయ్య, వీరమాచినేని బుజ్జి, టౌన్ పార్టీ టి. డి పి అధ్యక్షులు అట్లూరి శ్రీనివాసరావు, గన్నవరం ఏ ఎం సి డైరెక్టర్ గార్లపాటి రాజేశ్వరరావు, రిటైర్డ్ పి ఇ టి, లయన్ అక్కినేని రాఘవేంద్రరావు,లయన్ కళ్ళేపల్లి నారాయణ రావు, లయన్ తాడి రంగారావు, కడగల శ్రీనివాసరావు, గొట్టాపు వాసుదేవరావు, దాసరి బెనర్జీ,అల్లంశెట్టి శ్రీనివాసరావు,మొవ్వా రామారావు, మేడేపూడి రామమోహన్ రావు,యార్లగడ్డ సత్యన్నారాయణ, పోతుమర్తి సత్యన్నారాయణ, జాస్తి భూపతి, పలువురు ఫేస్ బుక్ ద్వారా ఫోన్ ద్వారా శుభాకాంక్షలు తెలిపారు. బాపులపాడు మండలంలోని విద్యారంగానికి చెందిన పలువురు ప్రముఖులు హాజరయ్యారు.



# నియోజకవర్గంలో యార్లగడ్డ పరామర్శ యాత్ర



**గన్నవరం, అక్టోబర్ 22, మేజర్ న్యూస్ :** నియోజకవర్గంలో అనారోగ్యంతో బాధపడుతున్న పలువురు టిడిపి నాయకులను ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు బుధవారం పరామర్శించారు. గన్నవరం మండలం వీరపనేనిగూడెం గ్రామానికి చెందిన టిడిపి సీనియర్ నాయకులు ఉయ్యూరి శ్రీరామిరెడ్డి అనారోగ్యానికి గురై వైద్యశాల చికిత్స పొంది ఇంటికి చేరుకున్నారు. సమాచారం తెలుసుకున్న యార్లగడ్డ బుధవారం మధ్యాహ్నం వీరపనేనిగూడెం గ్రామంలోని శ్రీరామిరెడ్డి ఇంటికి వెళ్లి ఆయనను పరామర్శించి యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకొని దైనందిన కార్యక్రమాల్లో పాల్గొనాలని కోరారు. అనంతరం బాపులపాడు మండలం మలవల్లి గ్రామానికి చేరుకున్న యార్లగడ్డ అనారోగ్యంతో బాధపడుతున్న టిడిపి సీనియర్ నాయకులు యనమదల వెంకయ్య రావును పరామర్శించారు. అనారోగ్యం నుంచి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం ఇదే మండలం కొత్తపల్లి గ్రామానికి చేరుకున్న యార్లగడ్డ ఇటీవల మరణించిన షేక్ బషీర్ కుటుంబాన్ని పరామర్శించారు. అల్లుడు మరణంతో దుఃఖసాగరంలో మునిగిపోయిన బషీర్ మామ మస్తాన్ వలీ ని ఓదార్చి, అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. బాపులపాడు మండలం అంపాపురం గ్రామంలో ఇటీవల మరణించిన టిడిపి సీనియర్ నాయకులు గోగినేని శివరామకృష్ణ కుటుంబాన్ని బుధవారం సాయంత్రం ఎమ్మెల్యే యార్లగడ్డ పరామర్శించారు. ఈ సందర్భంగా యార్లగడ్డ మాట్లాడుతూ పార్టీ కోసం అంకితభావంతో పనిచేసిన శివరామకృష్ణ లేని లోటు తీర్చలేనిదన్నారు. శివరామకృష్ణ కుటుంబానికి పార్టీ తరపున అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ప్రజలు పలు సమస్యలను యార్లగడ్డ దృష్టికి తీసుకురాగా ఆయా సమస్యలను సత్వరమే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమాల్లో పలువురు టిడిపి నాయకులు పాల్గొన్నారు. అనంతరం పెద్దావుటపల్లి గ్రామంలో పలువురు టిడిపి నాయకుల్ని యార్లగడ్డ పరామర్శించారు.

## నేడు గాజుల అలంకారంలో దర్శనమివ్వనున్న దుర్గమ్మ



**ఇంద్రకీలాద్రి మేజర్ న్యూస్ :** ఇంద్రకీలాద్రిపై వేంచేసిన దుర్గమ్మ నేడు గాజుల అలంకారంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. ఇప్పటికే అమ్మవారి ఆలయ ప్రాంగణాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. భక్తులు ఇచ్చినటువంటి గాజులకు ప్రత్యేక పూజలు కూడా నిర్వహించారు. ప్రతీ ఏటా అమ్మవారికి గాజుల అలంకారం నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. నేడు కూడా అమ్మవారు గాజుల అలంకారంలో భక్తులకు దర్శనమివ్వనున్న నేపధ్యంలో దుర్గగుడి ఈవో శీనా నాయక్, చైర్మన్ బొర్రా రాధాకృష్ణ ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అమ్మవారికి వివిధ రకాల రంగురంగుల గాజులను అలంకరించిన దర్శనానికి భక్తులు వేలాదిగా వస్తారని అంచనా వేస్తున్నారు. అందుకు తగ్గ ఏర్పాట్లు చేశామని ఈవో శీనా నాయక్ పేర్కొన్నారు. గాజుల అలంకారంలో ఉన్న దుర్గమ్మను దర్శించుకుంటే అంతా మంచి జరుగుతుందని చెబుతున్నారు వైదిక కమిటీ సభ్యులు.

## శ్రీ లంకమ్మ గుడి ఆవరణలో స్వాములకు ఉచిత సద్ది



**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** పవిత్ర కార్తీక మాసంలో మాల ధారణ చేసే భక్తుల కోసం నెల రోజులపాటు సద్ది ఏర్పాటు చేస్తున్నట్లు అయ్యప్ప స్వామి అన్నదాన కమిటీ వారు తెలిపారు. బుధవారం స్థానిక ఎమ్మెల్యే తనయుడు మండలి వెంకట్రామ్ ఆలయానికి విచ్చేసి అమ్మవారిని దర్శించుకుని కమిటీ ఏర్పాటు చేసిన సద్ది కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్తీక మాసం అన్ని రోజులు భక్తిశ్రద్ధలతో మాల ధరించే అయ్యప్ప, శివ,ఆంజనేయ, వెంకటేశ్వర, సాయి, భవాని మాల ధరించిన స్వాములకు కార్తీక మాసం నెలరోజులపాటు కొనసాగుతుందని తెలిపారు.అవనిగడ్డ గ్రామ దేవత శ్రీ లంకమ్మ తల్లి అమ్మవారి ఆలయ ఆస్థాన మండపంలో గత నాలుగు సంవత్సరాలుగా ప్రతిరోజు మధ్యాహ్నం సద్ది ఏర్పాటు చేస్తున్న నిర్వహణ కమిటీని రాజా అభినందించారు. ఈ సద్ది ఏర్పాటుకు అయ్యప్పల నుండి ఏ విధమైన రుసుము తీసుకోకుండా దాతల సహాయంతో ఏర్పాటు చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రముఖులు అన్నపరెడ్డి వెంకట స్వామి, మాల ధరించిన గురు స్వాములు పాల్గొన్నారు.

## మద్యం దుకాణాలు తనిఖీ చేసిన ఎమ్మెల్యే కుమార్ రాజా



**పామర్రు మేజర్ న్యూస్ :** పామర్రు పట్టణంలోని పలు మద్యం దుకాణాలలో స్థానిక శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా బుధవారం తనిఖీలు నిర్వహించారు. క్యూఆర్ కోడ్ ద్వారా మద్యం నిలువలను ఈ సందర్భంగా ఆయన తనిఖీ చేశారు. నాణ్యమైన మద్యంను క్యూఆర్ కోడ్ ద్వారా పరిశీలించి ఎటువంటి అవకతవకలు జరగకుండా మద్యం అమ్మకాలు జరపాలని నిర్వాహకులకు విజ్ఞప్తి చేశారు. నకిలీ మద్యం ఆనవాళ్లు కనిపిస్తే దుకాణాలను సీజ్ చేయిస్తామని హెచ్చరించారు. అలాగే వినియోగదారులతో మాట్లాడుతూ నాణ్యమైన మద్యంను క్యూఆర్ కోడ్ ద్వారా పరిశీలించి కొనుగోలు చేయాలని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కుమార్ రాజా తోపాటు జనసేన పార్టీ పామర్రు నియోజకవర్గ ఇంచార్జ్ తాడిశెట్టి నరేష్, తూర్పు కృష్ణా డెల్టా ప్రాజెక్టు కమిటీ వైస్ చైర్మన్ వల్లూరుపల్లి గణేష్, పమిడిముక్కల డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ నాదెళ్ల సుబ్రహ్మణ్యం, పమిడిముక్కల మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు రాజులపాటి శ్రీనివాసరావు, పార్టీ సీనియర్ నాయకులు మండపాక శంకర్ బాబు, జక్కా శ్రీనివాసరావు, పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.

## పంచారామాలకు ప్రత్యేక బస్సులు

**విజయవాడ మేజర్ న్యూస్ :** కార్తీక మాసం సందర్భంగా పర్యాటక శాఖ ఆధ్వర్యంలో పంచారామాలకు ప్రత్యేక బస్సులను నడపనున్నట్లు టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ డివిజనల్ మేనేజర్ కృష్ణ చైతన్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రత్యేక పంచారామాల టూర్ ప్యాకేజీలో భాగంగా అమరలింగేశ్వర స్వామి- అమరావతి, సోమేశ్వర స్వామి- భీమవరం, క్షీరారామలింగేశ్వర స్వామి- పాలకొల్లు, భీమేశ్వర స్వామి- ద్రాక్షారామం, కుమారరామ స్వామి, -సామర్లకోట పంచారామ క్షేత్రాలు ఉన్నాయన్నారు. ప్రతీ సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదురుగా ఉన్న టూరిజం కేంద్ర రిజర్వేషన్ కార్యాలయం నుండి ఈ నెల 27, నవంబర్ 03,10,17 సోమవారం తేదీల్లో బస్సులు బయలుదేరతాయన్నారు. పెద్దలకు: రూ.2130 ల, పిల్లలు: రూ. 1760లు ధర ఉంటుందన్నారు. వీటితోపాటు ప్రతి శనివారం విజయవాడ నుండి వాడపల్లి వరకు ప్రత్యేక బస్ ను పర్యాటక శాఖ నిర్వహిస్తోందన్నారు.. బుకింగ్‌ల కోసం www.tourism.ap.gov.in, ఇతర వివరాలకు 98480 07025, 84990 54422, 1800 42545454 పర్యాటక శాఖ డివిజనల్ మేనేజర్ కృష్ణ చైతన్య ఆ ప్రకటనలో తెలియజేశారు..

## కోటి సంతకాల సేకరణ



**మొవ్వ మేజర్ న్యూస్ :** ప్రభుత్వ వైద్య కళాశాలలు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కోటి సంతకాల సేకరణలో భాగంగా బుధవారం మండల పరిధిలోని భట్లపెనుమర్రు, పెదపూడి గ్రామాల్లో కోటి సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. అలాగే పెదపూడి గ్రామంలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు రాజులపాటి రాఘవరావు, పెదపూడి గ్రామ సర్పంచ్ తాత రజిని, రాంబాబు, రాజేష్, భట్ల పెనుమర్రు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేతలు కొడమంచిలి నాంచారయ్య, అంగడాల నగేష్, గొరిపర్తి మస్తాన్, అంగడాల సుబ్బారావు, వీరంకి జగదీష్, సాయి ప్రసాద్, ఏసురత్నం, వివేకవర్ధన్, ఎలీషా బాబు, సుబ్బారావు పాల్గొన్నారు.

## వర్షాన్ని సైతం లెక్కచేయనీ భక్తులు



**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** దివిసీమ కొంగు బంగారమై కోరిన కోరికలు తీర్చే కలపవల్లిగా విరాజుల్లుతున్న గ్రామ దేవత శ్రీ లంకమ్మ తల్లి అమ్మవారికి పెద్ద ఎత్తున మొక్కుబడులు తీర్చుకున్నారు కార్తీక మాస పాడ్యమి తిథి బుధవారం అవనిగడ్డ నలుమూలల నుండి భక్తులు తలపై ఘటం బిందె మెడలో గారెల దండ వేసుకుని రంగులు చల్లుకుంటూ తీన్మార్ డప్పు కోలాటం అనుగుణంగా నృత్యాలు చేసుకుంటూ ఆలయానికి తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకున్నారు. భారీగా వర్షాన్ని సైతం లెక్కచేయకుండా భక్తులు తరలిరావడంతో ఆలయ ప్రాంగణం కళకళలాడింది. భక్తులకు కావలసిన ఏర్పాట్లును ఆలయ కార్యనిర్వహణ అధికారి యార్లగడ్డ శ్రీనివాసరావు (వాసు) ఆలయ సిబ్బంది పర్యవేక్షించారు.

## ఉచిత శిక్షణ సద్వినియోగం చేసుకోవాలి



**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ తెలిపారు. బుధవారం స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో ఉచిత శిక్షణ కార్యక్రమం పోస్టర్లు ఆవిష్కరించారు. అవనిగడ్డ ప్రభుత్వ డీగ్రీ కాలేజీలో ఏర్పాటు చేసిన స్కిల్ హబ్ సెంటర్లో నవంబర్ 3 సోమవారం నుంచి నిరుద్యోగ మహిళలకు బ్యూటీషియన్, డేటా ఎంట్రీ ఆపరేటర్ (స్త్రీ, పురుషులు)కోర్సులు ఉచిత శిక్షణా తరగతులు ప్రారంభించనున్నట్లు తెలిపారు. 18 నుండి 45 సంవత్సరాల్లోపు వయస్సు గల మహిళలు ఈ శిక్షణ పొందవచ్చని తెలిపారు. నియోజకవర్గంలోని ఆరు మండలాల్లోని మహిళలు స్త్రీ శక్తి పథకము ద్వారా ప్రభుత్వం కల్పించిన ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణ సౌకర్యమును ఉపయోగించుకుని ఈ శిక్షణ పొంది, ఆర్థికంగా ఎదగాలని కోరారు. మూడు నెలల శిక్షణా కాలంలో బ్యూటీషియన్ కోర్సుతో పాటు అదనంగా డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సులో శిక్షణ తీసుకోవచ్చని సూచించారు. కార్యక్రమంలో స్కిల్ హబ్ కో-ఆర్డినేటర్ జి.పృథ్విజ పాల్గొన్నారు. మరిన్ని వివరాలకు 79955 34572 నెంబరుకు సంప్రదించగలరని పృథ్విజ కోరారు.

## ఘనంగా కొడాలి నాని జన్మదిన వేడుకలు



**గుడ్లవల్లేరు అక్టోబరు 22 మేజర్ న్యూస్:** రాష్ట్ర మాజీ మంత్రి కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) జన్మదిన వేడుకలను కౌతవరంలోని కేడీసీసీ జిల్లా మాజీ డైరెక్టర్ పడమటి సుజాత, నాంచారయ్య దంపతుల నివాసంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. కొడాలి నాని బర్త్ డే కేక్‌ను కట్ చేసి స్వీట్లు పంచిపెట్టారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ యువత మండల అధ్యక్షుడు గుదే రవి, పార్టీ నాయకులు మద్దాల వెంకటేశ్వరరావు, పడమటి బుద్ధు, చిట్టిబొమ్మ బలరామ్, భాషీ, సలాం, రోశయ్య, సురేష్, శ్రీకాంత్, పడమటి జగదీష్, రాజేష్, పడమటి అశోక్, బాలయ్య, పడమటి బాలకష్ణ, రంగారావు, డేవిడ్, యోహాన్ తదితరులు పాల్గొన్నారు.

# ట్రంప్ సుంకాలు భారతపై తీవ్ర ప్రభావం




**జగ్గయ్యపేట అక్టోబర్ 22 మేజర్ న్యూస్ :** పట్టణంలోని టీచర్స్ కో ఆపరేటివ్ సొసైటీ బిల్డింగ్ లో మంగళవారం రాత్రి యుటిఎఫ్ జగ్గయ్యపేట, వత్సవాయి, పెనుగంచిప్రోలు మండలాల ప్రాంతీయ శాఖల ఆధ్వర్యంలో యుటిఎఫ్ ఎన్టీఆర్ జిల్లా సహాధ్యక్షులు ఎం కృష్ణయ్య అధ్యక్షతన "ట్రంప్ సుంకాలు- భారత దేశంపై ప్రభావం" అనే అంశంపై యుటిఎఫ్ ఆధ్వర్యంలో స్టడీ సర్కిల్ నిర్వహించారు. ఈ స్టడీ సర్కిల్ కు ప్రధాన వక్తగా జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు, మాజీ శాసన మండలి సభ్యులు కె ఎస్ లక్ష్మణరావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ ట్రంప్ విధానాల వలన మనదేశంలో ఆక్వా పరిశ్రమ, వస్త్ర పరిశ్రమ, ఔషధ పరిశ్రమలపై తీవ్రమైన ప్రభావం పడుతుందని, పారిశ్రామిక ఉత్పత్తి కుంటుపడుతుందని, దేశం మొత్తం ఆర్థిక సంక్షోభంలోకి నెట్టివేయబడుతుందని, తద్వారా ఉద్యోగులు, కార్మికులు, రైతులు అందరి జీవన విధానం దెబ్బతింటుందన్నారు. భారత్ పై అమెరికా విధిస్తున్న 50 శాతం సుంకాలు దేశంపై తీవ్ర ప్రభావం చూపుతుందని అన్నారు. ఒక్క రొయ్యల వ్యాపారంలోని 34 వేల కోట్ల రూపాయలు నష్టమన్నారు. సినిమాల పైన సుంకాల దెబ్బ పడిందని తెలిపారు. భారత్ నుండి వెళ్లి అమెరికాలో చదువుకునే వారిపై ఈ ప్రభావం తీవ్రంగా ఉందని, అక్కడున్న భారతీయుల కాళ్లకు, చేతులకు బేడీలు వేసి తిప్పి పంపిన ప్రధాని మోడీలో చలనం లేదన్నారు. 1990లో నూతన ఆర్థిక విధానం ప్రారంభమైన సమయంలో వరల్డ్ ట్రేడ్ ఆర్గనైజేషన్ (డబ్ల్యూటీవో) ఒప్పందం మేరకు ఏ దేశం నుండి ఏ దేశమైనా సరుకును ఎగుమతి దిగుమతులు పన్నులు లేకుండా చేసుకోవచ్చని అమెరికా ప్రతిపాదించిందని గుర్తు చేశారు. ఈ ఒప్పందాన్ని సైతం అమెరికా ఉల్లంఘించింది అన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన యుటిఎఫ్ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు కె శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యావంతులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు ట్రంప్ విధిస్తున్న ఈ ఆర్థిక సుంకాలను అర్థం చేసుకొని సామాన్య ప్రజలను చైతన్యవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎం కృష్ణయ్య, జె సుధానంద్, ఏ నరసింహారావు, జి ముక్తేశ్వ రరావు, పి వెంకటేశ్వర్లు, ఎం రమణ, జి పల్లవి, ఎస్.కె నాగుల్ మీరా, టి జయసుధ, ఎస్ గంగాధరరావు, నంద్రు పుల్లయ్య, కె సాయి శ్రీనివాసరావు, వి.వి సుబ్బారావు, జివిటి రాజశేఖర్, వై రవికుమార్, ఎం డి మునీర్ బాషా, జి రవికుమార్, డి రత్న ప్రసాద్, సిహెచ్ఎస్ఎన్ మూర్తి, నెహెమ్యా, విబిచారి, దుర్గాప్రసాద్, బి కరుణాకరరెడ్డి, చావా కృష్ణయ్య, కె వెంకట రత్నం, ప్రజా సంఘాల నాయకుల్ను కోటా కృష్ణ, వెంకటేశ్వరరావు, దంతాల నరేంద్ర, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

# రైతులు పండించిన పంట మొత్తం కొనుగోలు చేయాలి



**చల్లపల్లి, మేజర్ న్యూస్ :** రైతులు పండించిన పంట మొత్తం కొనుగోలు చేయాలని ఆంధ్రప్రదేశ్ కౌలురైతుల సంఘం జిల్లా కార్యదర్శి పంచకర్ల రంగారావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం, కౌలురైతుసంఘం పిలుపుమేరకు చల్లపల్లి మండల కమిటీ ఆధ్వర్యంలో బుధవారం డిప్యూటీ తహసీల్దార్ శ్రీలతకు రైతు, కౌలురైతుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా రంగారావు మాట్లాడుతూ ఈ సార్వా సీజన్లో రైతులు పండించిన పంటలో 50శాతం మాత్రమే కొనుగోలు చేస్తామని ప్రకటించటం హాస్యాస్పదమన్నారు. 50శాతం ధాన్యాన్ని స్థానికులకు అమ్ముకోవాలని ప్రభుత్వ సూచనలు దళారులకు లాభాలు చేకూర్చేవిగా ఉన్నాయని తెలి పారు. ఇలాంటి ప్రకటనల వల్ల రైతులు నష్టపోతారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం కాంప్లెక్స్ ఎరువులపై 100 రూపాయలు పెంచినట్లు ప్రకటించిందని తెలిపారు. ఇప్పటికే సాగఖర్చులు పెరిగి రైతులు నష్టాల్లో కూరుకుపోతున్నారనీ, మూలిగే నక్కపై తాటికాయ పడిన చందంగా కేంద్ర ప్రభుత్వం కాంప్లెక్స్ ఎరువులపై అదనంగా పెంచటం ఆందోళన కలిగిస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పంట పెట్టుబడి సహాయం అన్నదాత సుఖీభవ పథకం కౌలు రైతులకు వెంటనే అందించాలని డిమాండ్ చేశారు. పంటమె ఎత్తాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కాంప్లెక్స్ ఎరువుల ధరలు తగ్గించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కౌలురైతుసంఘం ఉపాధ్యక్షులు యద్దనపూడి మధు, కౌలు రైతుసంఘం జిల్లా నాయకులు వాకా రామచంద్రరావు, మండల నాయకులు లంకపల్లి సత్యనారాయణ, మహమ్మద్ కరీమ ఎల్లా తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ పరిధిలో మెప్మా సిబ్బందిని సత్కరించిన ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్



**జగ్గయ్యపేట అక్టోబర్ 22 మేజర్ న్యూస్ :** పట్టణ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) సిబ్బందిని ఘనంగా సత్కరించారు. ఎమ్మెల్యే స్వగృహంలో మెప్మా సిబ్బందికి (మహిళలకు) పట్టు చీరల పంపిణీ కార్యక్రమంలో శాసనసభ్యుల దంపతులు శ్రీరాం రాజగోపాల్,శ్రీదేవ్లి, మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, మాజీ మున్సిపల్ చైర్మన్ శ్రీరాం సుబ్బారావు, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ నూకల కుమార్ రాజా ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ మాట్లాడుతూ పట్టణంలో మహిళా స్వయం సహాయక బృందాలను బలోపేతం చేయడంలో, వారికి రుణాలు అందించడంలో, నైపుణ్యాభివృద్ధి శిక్షణలు ఏర్పాటు చేయడంలో, అలాగే పట్టణంలో పారిశుధ్య నిర్వహణ, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో మెప్మా సిబ్బంది సేవలు అపారమైనవని కొనియాడారు. ముఖ్యంగా, క్లిష్ట సమయాల్లో కూడా ప్రజలకు అండగా ఉండి, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న వారి నిబద్ధత ప్రశంసనీయమని పేర్కొన్నారు. మెప్మా సిబ్బందికి ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర మాట్లాడుతూ... మెప్మా సిబ్బంది నిస్వార్థ సేవలే పట్టణ పురోగతికి మూలమని, ప్రతి ఇంటికీ ప్రభుత్వ సాయాన్ని అందించడంలో వారు వారధులుగా పనిచేస్తున్నారని తెలిపారు. పట్టణంలో పేదరిక నిర్మూలనకు వారి కృషి ఎంతో ముఖ్యమైనదని అన్నారు.

మెప్మా సిబ్బంది భావోద్వేగ స్పందన: ఈ సత్కారానికి స్పందించిన మెప్మా సిబ్బంది భావోద్వేగానికి లోనయ్యారు. తమలో ఒకరైన ప్రతినిధి మాట్లాడుతూ, "మా సేవలను గుర్తించి, బుధవారం మమ్మల్ని ఇంతగా గౌరవించినందుకు ఎమ్మెల్యేకి, మున్సిపల్ చైర్మన్‌కి, అధికారులందరికీ కృతజ్ఞతలు. కొన్నిసార్లు, ఉదయం లేచిన దగ్గర నుండి అర్ధరాత్రి వరకు పనిచేయాల్సి వచ్చినా, కుటుంబ విషయాలను పక్కన పెట్టినా, మా కష్టాన్ని ఎవరైనా గుర్తించినప్పుడు కలిగే సంతృప్తి అమూల్యం. ముఖ్యంగా, 'మీ సాయంతో మాకు రుణం వచ్చింది', 'మీ వల్లే మా పిల్లలకు చదువు చెప్పగలుగుతున్నాం' అని మహిళలు చెప్పే మాటలు మాకు గొప్ప స్ఫూర్తినిస్తాయి. ఇది కేవలం ఉద్యోగం కాదు, వేలాది మంది పేద మహిళల జీవితాల్లో వెలుగులు నింపే అవకాశం. బుధవారం పట్టు చీరల సత్కారం, మీరు చూపిన ఆదరణ మా బాధ్యతను మరింత పెంచింది. ప్రజల సేవలో మరింత ఉత్సాహంగా పనిచేస్తామని హామీ ఇస్తున్నాం" అని కన్నీళ్లతో తెలిపారు. అనంతరం, మెప్మా సిబ్బందికి ఎమ్మెల్యే, చేతుల మీదుగా పట్టు చీరలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, కౌన్సిలర్లు, మెప్మా సిబ్బంది కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



# పేటలో ఘనంగా అమరవీరుల సంస్మరణ దినోత్సవ వేడుకలు





**జగ్గయ్యపేట అక్టోబర్ 22 మేజర్ న్యూస్ :** పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా పట్టణ పోలీస్ స్టేషన్లో ఓపెన్ హౌస్ కార్యక్ర మాన్ని ఏర్పాటు చేశారు. సీఐ పీ వెంకటేశ్వర్లు ఓపెన్ హౌస్ కార్యక్రమానికి విచ్చే సిన స్థానిక లిటిల్ ఏంజెల్స్ హై స్కూల్ విద్యార్థిని విద్యార్థులను ఉద్దేశించి పోలీస్ స్టేషన్‌లో అధికారుల విధులను వివరించారు. ఎక్కడేనా సంఘటన జరిగినప్పుడు బాధితులు నేరుగా పోలీస్ స్టేషన్ కు వచ్చి ఫిర్యాదు చేయాలని, ఫిర్యాదులోని అంశాల ఆధారంగా ప్రథమ సమాచార నివేదికను తయారు చేసి, సంఘటన జరిగిన ప్రాంతానికి వెళ్లి సాక్షులను విచా రించి దర్యాప్తు చేస్తామని సీఐ వివరించారు. ముద్దాయిలకు బిఎన్ఎస్ ప్రకారం కోర్టులు శిక్షలు విధిస్తాయని తెలిపారు. పేట ప్రాంతంలో సర్కిల్ పరిధిలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి సంఘటనల్లో ముద్దాయిలను త్వరితగతిన అరెస్టు చేయగలుగుతున్నామని పలు ఉదాహరణలతో వివరించారు.పిల్లలు సైబర్ క్రైమ్ పట్ల అవగాహన కలిగి ఉండాలని, సైబర్ క్రైమ్‌లు ఎలా జరుగుతాయో పలు ఉదాహరణలతో వారికి అవగాహన కల్పించారు. చట్టం విషయంలో అందరూ సమానమేనని, నేరం ఎవరు చేసినా ఒకే రకమైన శిక్షలు ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో జగ్గయ్యపేట ఎస్సైలు జి.రాజు, శంకర్ నాయక్, సత్యనారాయణ, లిటిల్ ఏంజెల్స్ హైస్కూల్ ప్రిన్సిపాల్ ఎన్ఎస్ ఆర్ఎస్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# దాళ్వా పంటకు సాగునీరు అందించాలని ఎమ్మెల్యేకు వినతి



**బంటుమిల్లి మేజర్ న్యూస్ :** దాళ్వా పంటకు సాగునీరు అందించాలని బుధవారం స్థానిక ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్‌కు నాగేశ్వరావుపేట తన స్వగ్రామంలో రైతులు వినతి పత్రం అందజేశారు. బంటుమిల్లి ప్రధాన కాలువ పరిధిలోని పెడన, బంటుమిల్లి, కృత్తివెన్ను మండలాల్లోని సాగు భూములు అత్యధికల చౌడు భూములేనని, ఆ భూములు వరి సాగుకు తప్ప మరే ఇతర పంటలకు అనుకూలించమన్నారు. ఈ స్థితిలో బంటుమిల్లి ప్రధాన కాలువ పరిధిలో దాదాపు 5 సంవత్సరాలుగా కృష్ణా పరివాహక ప్రాంతంలో నీరు అందుబాటులో ఉన్న రెండో పంట దాళ్వాకు సాగునీరు విడుదల చేయలేదు. దీని కారణంగా భూములు చౌడుబారి సాగుకు అనుకూలంగా లేక దిగుబడులు రావడం లేదన్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలోను 4 సంవత్సరాలు రెండో పంటకు సాగునీరు విడుదల చేయలేదు. రెండో పంట లేక భూమి సారం తగ్గిపోయి దిగుబడులు రాక కౌలు రైతులు వ్యవసాయం చేసేందుకు ముందుకు రాక రైతులునష్టపోతున్నారన్నారు. బంటుమిల్లి ప్రధాన కాలువ పరిధిలో రెండో పంట దాళ్వాకు సాగునీరు విడుదల చేసి కుటమి ప్రభుత్వం రైతులు, రైతు కూలీల మన్ననలు పొందాలన్నారు. రెండో పంట లేని కారణంగా వేలాది ఎకరాల సాగు భూములు చేపలు, రొయ్యల చెరువులుగా మారిపోతున్నాయని, రెండో పంటకు సాగునీరు అందించి రైతులను ఆదుకోవాలని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో నియోజవర్గ కార్యకర్తలు నాయకులు రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే యార్లగడ్డ పరామర్శ





**హనుమాన్ జంక్షన్ మేజర్ న్యూస్ :** అనారోగ్యంతో బాధపడుతున్న పలువురు టిడిపి నాయకులను ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు స్థానిక నాయకులతో కలిసి బుధవారం పరామర్శించారు. అనారోగ్యంతో బాధపడుతున్న బాపులపాడు మండలం మలవల్లి గ్రామానికి చేరుకున్న టిడిపి సీనియర్ నాయకులు యనమదల వెంకయ్య రావును పరామర్శించి త్వరగా కోలుకోవాలని కోరారు. అనంతరం కొత్తపల్లి గ్రామానికి చేరుకున్న షేక్ బషీర్ ఇటీవల మరణించగా వారి కుటుంబాన్ని పరామర్శించి ధైర్యం చెప్పి పార్టీ అండగా ఉంటుందని చెప్పారు. బాపులపాడు మండలం అంపాపురం గ్రామ టిడిపి సీనియర్ నాయకులు ఇటీవల మరణించిన గోగినేని శివరామ కృష్ణ కుటుంబాన్ని ఎమ్మెల్యే యార్లగడ్డ పరామర్శించారు. శివరామకృష్ణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి ఆయన కుటుంబాన్ని ఓదార్చి సానుభూతి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ కోసం అంకితభావంతో పనిచేసిన శివరామకృష్ణ లేని లోటు తీర్చలేనిదన్నారు.ఆయన కుటుంబానికి పార్టీ ఎప్పుడు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమాల్లో మండల అధ్యక్షుడు దయాల రాజేశ్వరరావు,టౌన్ అధ్యక్షుడు అట్లూరి శ్రీనివాస్, వేమల పల్లి శ్రీనివాసరావు,పలువురు టిడిపి నాయకులు పాల్గొన్నారు.

# పోలీసు సిబ్బందికి స్పోర్ట్స్ కిట్స్‌లు అందజేత



**విజయవాడ క్రైం, మేజర్ న్యూస్ :** క్రీడలు ఆడటం వలన క్రమశిక్షణ వస్తుందని, ప్రతి మనిషి దైనందిన జీవితంలో ఏదో ఒక వ్యాయామం తప్పనిసరని, తద్వారా శారీరకంగా, మానసికంగా ఉత్సాహంగా ఉంటారని, పోలీసులు శారీరక ఆరోగ్యంతో పాటు మానసికంగా ప్రశాంతంగా ఉన్నప్పుడు వారి కుటుంబాలు కూడా సంతోషంగా ఉంటాయని మనసు సక్రమంగా ఉంటే ప్రజలకు మెరుగైన సేవలు అందిచవచ్చునే సదుద్దేశంతో నగర పోలీసు కమిషనర్ క్రీడలలో పాల్గొనేందుకు ఎన్.టి.ఆర్ జిల్లా పోలీసు సిబ్బందిని ఉత్సాహ పరచడానికి పోలీస్ వెల్ఫేర్ ఫండ్ నుండి రూ.65,000/- నగదుతో రెండు వాలీబాల్ కిట్స్ లను, రెండు క్రికెట్ కిట్స్ లను, నాలుగు ఫుట్ బాల్స్, బ్యాట్మింటన్ కిట్ లను కొనుగోలు చేయించడం జరిగింది.ఈ క్రమంలో ఈ రోజు పోలీసు కమిషనర్ వారి కార్యలయంలో పోలీసు కమిషనర్ ఎస్.వి.రాజ శేఖర బాబు, అడ్మిన్ డి.సి.పి. కె.జి.వి.సరిత  సదరు కిట్స్ లను పోలీసు సిబ్బందికి అందించారు. ఈ సంధర్భంగా పోలీసు కమిషనర్ మాట్లాడుతూ.... నిత్యం పని ఒత్తిడి తో పోలీసులు బిజీగా ఉండటం వలన శారీరక, మానసిక శ్రమ ఒత్తిడి మనపై అధికంగా ఉంటుంది, ప్రతిరోజూ వ్యాయామం చేస్తున్నా... క్రీడలు మరింత ఉత్సాహాన్ని ఇస్తాయి, పోలీసు శాఖలో ఫిజికల్ ఫిటనెస్ ఎంతో అవసరం, వ్యాయామం, క్రీడలు... పోలీసుల్లో మరింత ఉత్తేజాన్ని నింపుతాయి, క్రీడలతో మనకి తెలియకుండానే మనసికంగా ధృడత్వాన్ని పొందుతాం, ప్రజల్లో పోలీసులపై అంచనాలు రోజు రోజుకు పెరుగుతున్నాయి, అంధరూ వ్యాయామం, క్రీడల్లో పాల్గొని ఫిజికల్ ఫిటనెస్ పెంచుకుని ఆరోగ్యంగా ఉండాలని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో పోలీసు కమిషనర్ ఎస్.వి.రాజ శేఖర బాబు, అడ్మిన్ డి.సి.పి. కె.జి.వి.సరిత, డి.సి.పి. ఎస్.వి.డి.ప్రసాద్, ఏ.సి.పి.లు భాను ప్రకాష్ రెడ్డి, కృష్ణం రాజు, ఇన్స్పెక్టర్లు, ఆర్.ఐ.లు, సిబ్బంది పాల్గొన్నారు.



## పవిత్ర కృష్ణాది తీరాన ప్రారంభమైన కార్తీక మాస దీపోత్సవాలు, పుణ్యస్నానాలు

**నాగాయలంక అక్టోబర్ 22 మేజర్ న్యూస్ :** నాగాయలంక గ్రామంలో పవిత్ర కృష్ణానది తీరాన శ్రీవెంకటేశ్వర స్వామి దేవస్థానంప్రక్కన వేంచేసియున్న పుష్కర్ ఘాట్ సమీపంలో కార్తీకమాస దీపోత్సవాలు కన్నుల పండుగగా భక్తుల పుణ్య స్నానాలుచేసి కారిక్త దీపారాథన చేశారు. అనంతరం హైదరాబాద్ వాస్తవ్యులు కంఠమనేని ప్రేమ్ చంద్(అడ్వకేట్) సహాయముతో కృష్ణా నది పుష్కర్ ఘాట్ వద్ద నదిలో మొక్కుబడి నియమిత్వం శివలింగ ప్రతిష్ట చేసి గోపురం నిర్మించారు. ఆ ప్రదేశంలో కల ఆ మహాదేవుని ప్రతిరూపమైన శివలింగా కారునికి, నందీశ్వరునికి ఉన్న సాలగ్రామ ఏక రూప శివలింగమునకు భక్తులు కృష్ణానది జలముతో ఆవు పాలతో తేనెతో నవ ధాన్యాలతో పరిమల పుష్పాలతో పూజా కార్యక్రమాలు చేశారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ పురోహితులు సాయి కార్యక్రమాలు జరిపించి నారు భక్తులు విరివిరిగా పాల్గొని కృష్ణ నదిలో స్నానాలు ఆచరించి పరిమళ పుష్పాలు స్వామి వారికి, విభూది నందీశ్వరునికి శివలింగాకారునిగా ఉన్న పరమేశ్వరునికి, నందీశ్వరునికి అలంకారములు చేసి పూజాకార్యక్రమాలు చేశారు.

## దేవస్థానాల జీర్ణోద్ధరణకు విరాళాల వెల్లువ



**గుడ్లవల్లేరు అక్టోబరు 22 మేజర్ న్యూస్:** గుడ్లవల్లేరు శ్రీ రమా సహిత సత్య నారాయణ స్వామి, శ్రీ గంగానమ్మ దేవస్థానాల జీర్ణోద్ధరణ పనులకు పలువురు దాతల నుంచి విరాళాలు బుధవారం వెల్లువెత్తాయి. పోలవరపు రామ కోటేశ్వరరావు స్మారకార్థం ఆయన పెద్ద కుమారుడు, కోడలు పోలవరపు వెంకటేశ్వరరావు, విద్యామల దంపతులు (ఆంధ్రాబ్యాంక్) రూ.20,232, చిన్న కుమారుడు పోలవరపు విజయ్‌కుమార్ రూ.10,116, కొనుకొలను మధుసూధనరావు(కె.ఎం.ఆర్), వరలక్ష్మి దంపతులు రూ.18వేలు, కొసరాజు నారాయణ ప్రసాద్, సీత దంపతులు రూ.5వేల విరాళాల్ని అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఈఆర్ఎమ్ విద్యా సంస్థల చైర్మన్ వల్లభనేని వెంకట్రావు, మాజీ జెడ్పీటీసీ కొసరాజు బాపయ్యచౌదరి, నెహ్రూ పశువుల సంత కమిటీ చైర్మన్ వల్లభనేని సుబ్బారావు, కార్యదర్శి ఈడ్పుగంటి ఉమా, డైరెక్టర్ వల్లభనేని బుడ్డిబాబు, పీఏసీఎస్ అధ్యక్షుడు వెనిగెళ్ల రాము, కాగితం ఆదినారాయణ, దేవస్థాన ధర్మకర్తలు మురాల నరేష్, రవి తదితరులు పాల్గొన్నారు.

## మండలి వెంకటకృష్ణారావు శత జయంతి వేడుకలు



**నాగాయలంక అక్టోబర్ 22 మేజర్ న్యూస్ :** నాగాయలంక గ్రామంలో షిరిడి సాయిబాబా వారి దేవస్థానం సమీపంలో వేంచేసి ఉన్న మండలి వెంకటకృష్ణారావు విగ్రహానికి వర్షములోనూ వెనుక తగ్గక మండల వెంకటకృష్ణ రావు అభిమానులు కార్యక్రమాలు జరిపించుచున్నారు. బుధవారం కమ్మనమోల వాస్తవ్యులు ఉప సర్పంచ్ నాగులపాటి శ్రీనివాసరావు పూలమాలవేసి శ్రద్ధాంజలి ఘటించారు.  ఈ కార్యక్రమానికి మండలి వెంకటకృష్ణారావు అభిమాన సభ్యులు బావ దేవరపల్లి సర్పంచ్ మండల్ ఉదయభాస్కర్ నాగాయలంక బీసీ చైర్మన్ బండ్రెడ్డి నాగ మల్లికార్జున్ టీ కొత్తపాలెం మాజీ సర్పంచ్ మెండులక్ష్మణరావు బండ్రెడ్డి నాగమల్లికార్జున్ నాగాయలంక  ఉపసర్పంచ్ తలశిల వెంకట నరసింహారావు గుడివాడ శివరావు జనసేన సభ్యులు బండ్రెడ్డి వీర నాగ మల్లికార్జున్ భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షుడు గుడివాడ శివాజీ చెన్నగిరి లతా మోహన్ బండ్రెడ్డి హరి ఒక్క పట్ల వారి పాలెం సర్పంచ్ అంబటి శ్యాంప్రసాద్ భోగాది అనురాధ రిటైర్ ఎంఈఓ తలసిల రామకృష్ణ రేమాల బాబురావు మాదివాడ అర్జున్ రావు కర్రా రవి షేక్ జానీ దాసరి శేఖర్ రేపల్లె హర్ష ముమ్మారెడ్డి శ్రీనివాసరావు చందన సుబ్బారావు తలశిల శివరామకృష్ణ తలశిల రాఘవరావు మర్రిపాలెం మాజీ సర్పంచ్ బండ్రెడ్డి బోసు తానంకి చంటి టోటల్ రత్నారావు తదితరులు పెద్దలు కూటమి నాయకులు మండలి అభిమానులు పాల్గొని కార్యక్రమం జయప్రదం చేశారు.

# కర్ణాటకలో స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ఉన్నతాధికారుల సభ్యుల బృందం పర్యటన







### కార్పొరేషన్ చైర్మన్ కొమ్మా రెడ్డి పట్టాభిరామ్ నేతృత్వంలో మంగళూరు, దక్షిణ కన్నడ జిల్లాల పర్యటన

### ఏపీలో త్వరలో ఏర్పాటు కానున్న ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్మెంట్‌ప్లాంట్స్

**విజయవాడ, మేజర్ న్యూస్ :** ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాన్ని డంప్ యార్డ్ ఫ్రీ స్టేట్ గా మార్చే దిశగా ప్రభుత్వం అడుగులు వేయడంతో పాటు ప్లాస్టిక్ వాడకాన్ని కూడా పూర్తిగా నిరోధించడంలో బాగంగా స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మా రెడ్డి పట్టాభిరామ్ ఆధ్వర్యంలోని ఉన్నతాధికారుల బృందం కర్ణాటక రాష్ట్రంలో పర్యటించింది. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాన్ని స్వచ్ఛత విషయం లో ప్రధమ స్థానంలో నిలబెట్టాలనే ఉద్దేశంతో బెస్ట్ ప్రాక్టీసెస్ కింద ఇప్పటికే పలు రాష్ట్రాలలో స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ సభ్యుల బృందం పర్యటించిన సంగతి తెలిసిందే..అందులో భాగంగా ఈ రోజు కర్ణాటక రాష్ట్రంలోని మంగళూర్ తో పాటు దక్షిణ కన్నడ జిల్లాలలో కార్పొరేషన్ సభ్యుల బృందం పర్యటించింది..ఈ పర్యటనలో ముఖ్యంగా మంగళూరు, దక్షిణ కన్నడ జిల్లాలలోని ఎడపడవు,ఉజురే గ్రామ పంచాయతీలలో లోని మెటీరియల్ రికవరీ ఫెసిలిటీ సెంటర్స్ నీ, ఎఫ్ఎస్ టిపి ( ఫీకల్ స్లడ్జ్ ట్రీట్మెంట్ ప్లాంట్స్) పని తీరునీ స్వయంగా స్వచ్ఛ ఆంధ్రా కార్పొరేషన్ చైర్మన్ కొమ్మా రెడ్డి పట్టాభిరామ్, ఉన్నతాధికారుల సభ్యుల బృందం పరిశీలించింది.. అతి త్వరలో ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో ఉన్న 175 నియోజకవర్గాలలోని గ్రామీణ ప్రాంతాలలో ఏర్పాటు చేయబోతున్న ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్మెంట్ యూనిట్ ల స్థాపన కోసం కర్ణాటక రాష్ట్రం లో వేస్ట్ ప్రాసెసింగ్ యూనిట్ లు పరిశీలించడం జరిగిందని పట్టాభిరామ్ తెలిపారు..కర్ణాటక లోని ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్మెంట్ ప్లాంట్స్ ఏ విధంగా పని చేస్తున్నాయో అధ్యయనం చేసి అవి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రానికి ఏ విధంగా ఉపయోగపడితే ఆ విధంగా ఏపీ లో కూడా అమలు చేసేందుకు ప్రణాళికలు అమలు చేస్తామని స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మా రెడ్డి పట్టాభిరామ్ తెలిపారు..ఇప్పటికే ఏ రోజు చెత్త ఆ రోజు ప్రాసెస్ చేసే విధంగా అన్ని మున్సిపాలిటీలు, కార్పొరేషన్ లలో వేస్ట్ ప్రాసెసింగ్ యూనిట్ ల ఏర్పాటు జరుగుతుందని అలాగే ప్లాస్టిక్ విషయంలో కూడా ఇదే ప్రణాళికను అమలు చేసే ఉద్దేశంతో కర్ణాటక రాష్ట్రంలో ఉన్న ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్మెంట్ యూనిట్ లని ప్రత్యక్షంగా పర్యవేక్షించడం జరిగిందని పట్టాభిరామ్ తెలిపారు..గ్రామీణ ప్రాంతాలలో ఎక్కడకి వెళ్లినా ముందుగా అక్కడి చెత్త కుప్పలే స్వాగతం పలుకుతున్నాయని దానితో పాటు కాలువలు,ఖాళీ ప్రదేశాలలో విపరీతంగా ప్లాస్టిక్ కూడా పేరుకుపోతుందని దానిని రూపుమాపేందుకే ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్మెంట్ యూనిట్ లని గ్రామీణ ప్రాంతాలలో ఏర్పాటు చేసే ఆలోచన జరుగుతున్నదని పట్టాభిరామ్ తెలిపారు.. స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర ఉద్యమంలో బాగంగా సీఎం చంద్రబాబు ఇచ్చిన పిలుపు మేరకు ప్రజలు పెద్ద ఎత్తున స్పందిస్తున్నారని అందుకే అనుకున్న టైమ్ కే గత చెత్త ప్రభుత్వం వదిలి వెళ్ళిన 85 లక్షల టన్నుల చెత్తని క్లియర్ చేయడం జరిగిందని ఇప్పుడు గ్రామీణ ప్రాంతాలలో ఈ ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్మెంట్ ప్లాంట్స్ ఏర్పాటు చేసి స్వచ్ఛత విషయం లోనూ,పర్యావరణం విషయం లోనూ మరో అడుగు ముందుకు వేస్తామని పట్టాభిరామ్ స్పష్టం చేశారు..ఈ కార్యక్రమంలో కొమ్మా రెడ్డి పట్టాభిరామ్ తో పాటు స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు..

# ఎంజీ రోడ్డులో కీర్తిలాల్స్ కొత్త షోరూమ్ ప్రారంభం



**విజయవాడ మేజర్ న్యూస్ :** వజ్రాల ఆభరణాల పరిశ్రమలో ప్రసిద్ధ సంస్థ గ్లో బై కీర్తిలాల్స్ విజయవాడలో తన 8వ రిటైల్ షోరూమ్ ను ప్రారంభించింది. నగరంలోని ఎంజీ రోడ్డు దరి కళానికేతన్ ఎదురుగా ఏర్పాటుచేసిన ఈ షోరూమ్ కీర్తిలాల్స్ బిజినెస్ స్ట్రాటజీ డైరెక్టర్ సూరజ్ శాంతకుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రాండ్ విస్తరణకు, సున్నితమైన, అధిక నాణ్యత గల సహజ వజ్రాల ఆభరణాలను మరింత విస్తృత వినియోగదారుల వర్గానికి అందించాలనే లక్ష్యంతో షోరూం ప్రారంభించామన్నారు. ముఖ్యంగా జెన్ జెడ్ వినియోగదారుల అభిరుచులకు అనుగుణంగా ఆధునిక డిజైన్ లను అందించడంలో ఈ విస్తరణ కీలకమైన ముందడుగుగా నిలుస్తోందన్నారు. కొత్తగా ప్రారంభించిన ఈ షోరూమ్ లో తేలికపాటి సహజ వజ్రాల ఆభరణాల అద్భుతమైన సేకరణను ప్రదర్శించామని, వీటి ధరలు రూ. 7 వేల నుంచి ప్రారంభమవుతాయన్నారు. యువత యొక్క అభిరుచులు, ఆధునిక జీవనశైలికి అనుగుణంగా రూపొందించబడిన ఈ సేకరణ. ఆధునిక సౌందర్యాన్ని కాలాతీత సొగసుతో మిళితం చేస్తూ, రోజువారీ ధారణకు, ప్రత్యేక సందర్భాలకు సముచితంగా ఉండేలా రూపొందించబడిందన్నారు. గ్లో బై కీర్తిలాల్స్ యొక్క ప్రధాన ప్రత్యేకత హస్తకళ పట్ల దాని అంకితభావం అని, ప్రతి ఆభరణం సంస్థ యొక్క అంతర్గత, అత్యాధునిక తయారీ కేంద్రంలో, నైపుణ్యం కలిగిన హస్తకళాకారుల చేత అత్యాధునిక సాంకేతిక పద్ధతులతో జాగ్రత్తగా రూపొందించబడుతుందన్నారు. ఈ నైపుణ్యతతో కూడిన తయారీ ప్రక్రియ వల్ల ప్రతి వజ్రం అద్భుత ప్రకాశంతో మెరుస్తూ, ప్రతి ఆభరణం నాణ్యత, మన్నిక యొక్క అత్యున్నత ప్రమాణాలను అందుకునేలా చేస్తుందని చెప్పారు. విజయవాడ నగరంలో 'గ్లో బై కీర్తిలాల్స్'ను పరిచయం చేస్తున్నామని, నాణ్యతపై రాజీ పడకుండా, యువ కస్టమర్ల ప్రత్యేక వ్యక్తిత్వం, ఆశయాలను ప్రతిబింబించే ఆభరణాలను అందించడం ద్వారా వారితో బలమైన అనుబంధాన్ని నిర్మించడమే మా లక్ష్యం" అన్నారు. ఈ కార్యక్రమంలో గ్లో బై కీర్తిలాల్స్' ఫ్రాంచైజీ పార్టనర్ సాయి లీల తదితరులు పాల్గొన్నారు.



### ఆపదలో ఆపన్నులకు అండగా పారా రామకృష్ణ

**గన్నవరం, అక్టోబర్ 22, మేజర్ న్యూస్ :** నియోజకవర్గంలో మానవీయతను చాటుతూ, సహాయ హస్తాన్ని అందించిన సంఘటనలు స్ఫూర్తిదాయకంగా మారాయి. గన్నవరం నియోజకవర్గానికి చెందిన నంద్యాల వీర్రాజు ఈ నెల 17న కన్నుమూశారు. ఈ విషయం తెలుసుకున్న పీఆర్కే సేవా సంస్థ చైర్మన్ పారా రామకృష్ణ వారి కుటుంబాన్ని పరామర్శించారు. కుటుంబ సభ్యులు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, పిల్లల చదువుకు కూడా ఖర్చులు భరించలేని పరిస్థితి ఉందని తెలిసిన వెంటనే ఆయన స్పందించారు. వారి కుమారుడు జీవన్ కుమార్, కుమార్తె సౌందర్య చదువుకు ఆర్థిక సహాయం అందించారు. సౌందర్య పదవ తరగతిలో మెరుగైన ఫలితాలు సాధించిందని, చదువుపై ఆసక్తి ఉన్నదని తెలుసుకుని, తక్షణమే ఆమె కళాశాల ఫీజును చెల్లించారు. భవిష్యత్తులోనూ కుటుంబానికి అవసరమైన మద్దతును అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గన్నవరం గ్రామ సర్పంచ్ నిడమర్తి సౌజన్య, బిజెపి నాయకులు నిడమర్తి నాగేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి శేషు కుమార్ పాల్గొన్నారు. అలాగే ఉంగుటూరు మండలం నాగవరప్పాడు గ్రామానికి చెందిన లంక పెద్దబాబు తల్లి అనారోగ్యంతో నడవలేని స్థితికి చేరిన విషయం తెలిసిన చైర్మన్ పారా రామకృష్ణ వారి నివాసానికి వెళ్లి పరామర్శించారు. కుటుంబ సభ్యులు వివరించిన అనంతరం వెంటనే స్పందించి ఒక చక్రాల కుర్చీ అందించారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు నిడమర్తి నాగేశ్వరరావు, లంక పెద్దబాబు, సత్యనారాయణ (చిన్న బాబు) పాల్గొన్నారు. సమాజంలో సేవా దృక్పథంతో ముందుకు సాగుతున్న పీఆర్కే సంస్థ చైర్మన్ పారా రామకృష్ణ సాయం బాధిత కుటుంబాలకు మానసిక ధైర్యం కలిగించింది.



### వాలీబాల్ రాష్ట్ర టీమ్‌కు చల్లపల్లి విద్యార్థిని దివ్య

**చల్లపల్లి,మేజర్ న్యూస్ :** గుడివాడలో జరిగిన సీనియర్ అండర్ -17 వాలీబాల్ పోటీల్లో కృష్ణా జిల్లా తరపున ఆడిన చల్లపల్లి రాజా హైస్కూల్ విద్యార్థిని కుంచె దివ్య ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర టీమ్కు ఎంపికైనట్లు హెచ్ఎం సుదర్శన ప్రసాద్ తెలిపారు. రాష్ట్ర టీమ్కు ఎంపికైన దివ్యను హెచ్ఎంతో పాటు పీఈటీ శ్రీనివాస్, ఉపాధ్యాయ బృందం అభినందనలు తెలిపారు.

## భారీ వర్షాలు వల్ల పట్టణంలో ఎమ్మెల్యే కాగిత పర్యటన



**పెడన, మేజర్ న్యూస్:** బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వల్ల కురుస్తున్న భారీ వర్షాలకు పట్టణంలో జలమయమైన రోడ్లను పరిశీలిస్తూ యుద్ధ ప్రాతిపదికన వర్షపు నీటి నిల్వ ఉండకుం డా చూడాలని అధికారులను నియోజకవర్గ ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ ఆదేశించారు. ఈ మేరకు ఒక ఆయన పట్టణంలో ప్రధాన రహదారి గుండా తనను చర్ల తో కాలును అడగనా నడుస్తూ బస్టాండ్ ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టణంలో బుధవారం ఉదయం నుంచి కురుస్తున్న వర్షం కారణంగా పలు రహదారులు నీట మునగడంతో స్వయంగా పరిశీలించమన్నారు. స్థానిక ప్రజలతో ముచ్చటించి వారి సమస్యలను అడిగి తెలుసుకుంటూ, వర్షం కారణంగా నీరు నిల్వ ఉండటంతో వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. అధికారులు అప్రమత్తంగా ఉండి ఎప్పటికప్పుడు డ్రైన్లు, కాల్వలను శుభ్రపరుస్తూ పారిశుద్ధ్య పరిస్థితిని మెరుగుపరచాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి అర్జా నగేష్,సీరం ప్రసాదు, ఎక్కల శ్యామలరావు, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ అబ్దుల్ ఖయ్యూం (హన్ను ), పరస జితేంద్ర, తదితరులు ఉన్నారు.


## విలేకరులు కావలెను

నేటి దినపత్రిక సూర్య నందు నందిగామ టౌన్, నందిగామ రూరల్, కంచికచర్ల, వీరులపాడు, చందర్లపాడు మండలాల్లో పని చేయుటకు విలేకరులు కావలెను.

ఇట్లు ఎన్.వెంకట్, ఎన్టీఆర్ - కృష్ణా బ్యూరో
ఫోన్ : 9642 980 999